ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

Published From Nizamabad

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శుక్రవారం | 17-07- 2026 | సంపుటి: 17, సంచిక: 104, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ


### ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు

# చరమగీతం పాడుతాం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క - సచివాలయంలో 'రోహిత్ వేముల చట్టం' ముసాయిదాపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం**

**ఆనాటి హామీని నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం.. వివక్ష లేని విద్యా విధానమే మా లక్ష్యం**

**సమగ్ర ముసాయిదా నివేదికను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం**

**సమావేశానికి హాజరైన మంత్రులు (కమిటీ సభ్యులు) దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, జూలై 16 (ప్రజాకలం) :
ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే గుర్తింపు ఆధారిత వివక్షకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నివారణ) బిల్లు, 2026 రూపకల్పనపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి కీలక సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సీఎంహో అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌హో లు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో వివక్ష లేని ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం చట్టాన్ని అత్యంత పటిష్టంగా రూపొందిస్తున్నట్లు ప్రకటించారు.
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎజఖ)లో జరిగిన రోహిత్ వేముల విషాద ఉదంతం కేవలం తెలంగాణనే కాకుండా దేశం మొత్తాన్ని కదిలించిందని ఆయన అన్నారు. ఆనాడు వివక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన పోరాటంలో ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీహో స్వయంగా యూనివర్సిటీకి వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఆనాడు విద్యార్థులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ.. నాటి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డిహో ఈ యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా నేను ( భట్టి విక్రమార్క)మంత్రి శ్రీధర్ బాబు,హో క్రియాశీలక నేత పొన్నం ప్రభాకర్ మేమంతా పెద్ద ఎత్తున పోరాడాం. భవిష్యత్తులో తెలంగాణలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో ఎటువంటి వివక్ష లేని విద్యా విధానాన్ని, చట్టాన్ని తీసుకువస్తామని ఆనాడు ప్రజలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని మా ప్రభుత్వం ఈ రోజు నెరవేర్చడానికి రోహిత్ వేముల చట్టాన్ని తీసుకొస్తుందని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో

తరువాయి 2వ పేజీలో...



# కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

### సమీక్షల కోసం మీరే జిల్లాలకు రావాలి

**- మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ముఖాముఖిలో ఉద్యమకారుల డిమాండ్**

హైదరాబాద్, జూలై 16 (ప్రజాకలం) :
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అధికారిక షెడ్యూల్ ప్రకారం నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్, మరియు కరీంనగర్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీ మోతె శోభన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, శ్రీ అద్దంకి దయాకర్, మరియు శ్రీ ఎస్. రాములు నాయక్ తదితరులు హాజరై ఉత్తర తెలంగాణ జిల్లాల నుండి తరలివచ్చిన పోరాటయో ధుల నుండి వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనలో మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్ జిల్లాల ఉద్యమకారులు అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. సింగరేణి బొగ్గు గనుల సమ్మెల ద్వారా నాటి ప్రభుత్వ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మంచిర్యాల, ఆసిఫాబాద్ కార్మిక శ్రేణులు, ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా నిలిచిన కరీంనగర్ పోరాట గడ్డల త్యాగాలు చారిత్రాత్మకమైనవని ప్యానల్ స్పష్టం చేసింది. నేటి ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అత్యధిక శాతం మంది ఉద్యమకారులు సంక్షేమ పథకాల కంటే ముందే రెండు అత్యంత కీలకమైన డిమాండ్లను కమిటీ ముందు గట్టిగా లేవనెత్తారు:
కమిటీకి చట్టబద్ధత కల్పించాలి : ప్రస్తుతం ఏర్పాటైన కమిటీ కేవలం దరఖాస్తుల పరిశీలనకే పరిమితం కాకుండా, దీనికి పూర్తి స్థాయి న్యాయపరమైన చట్టబద్ధత కల్పించాలని ఉద్యమకారులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్






### ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని

# కోల్పోయింది

**- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వరుస సభలు**

**- 18న సరూర్‌నగర్‌లో భారీ యువజన సదస్సు**

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, జూలై 16 (ప్రజాకలం):
'యూత్ డిక్లరేషన్' పేరుతో అలవిగాని హామీలిచ్చి నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నమ్మ కాన్ని పూర్తిగా కోల్పోయిందని, పదవీకాలం

తరువాయి 2వ పేజీలో...



### వికలాంగ విద్యార్థుల సంక్షేమమే

# ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

**నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంపై సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ**

**విద్య-ఆరోగ్యం-మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం**

2

### సీతారామ ఎత్తిపోతల పథకం పనులను

# యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**- సీతారామ, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి**

**- భూసేకరణకు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తాం**

**- యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు.**



ఖమ్మం /సత్తుపల్లి, జూలై 16( ప్రజా కలం న్యూస్ )
సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ. 1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ. 8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

### యుకె కు ఎగుమతులు

# పెంచుతాం

**- మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్, జూలై 16 (ప్రజాకలం):
భారత్– యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సిఇటిఏ) వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు.

తరువాయి 2వ పేజీలో...




# ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షకు చరమగీతం పాడుతాం

మొదటి పేజీ తరువాయి...

బతకాలని, వివక్ష కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండకూడదన్న రాహుల్ గాంధీ ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటయిందని ఆయన స్పష్టం చేశారు.

అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు

బిల్లు రూపకల్పన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు డ్రాఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు.హా కొత్త చట్టానికి సంబంధించిన సమగ్ర విధివిధానాలతో కూడిన ప్రాథమిక ముసాయిదా నివేదికను సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత శాఖ సెక్రటరీని ఆదేశించారు. కర్ణాటకలో ఇప్పటికే ఇటువంటి చట్టం కోసం జరుగుతున్న ముసాయిదా ప్రయత్నాలను పరిశీలించి, అక్కడి ఉత్తమ పద్ధతులను స్వీకరించాలని సూచించారు. ఈ చట్టం రూపకల్పనలో ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకెళ్తామని, ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామనిహా ప్రకటించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజా సంఘాలు, స్టూడెంట్ అసోసియేషన్ల నుంచి సలహాలు, సూచనలను ఆహ్వానిస్తున్నామని.. ప్రజల నుంచి వచ్చే స్పందనను బట్టి బిల్లులో తుది మార్పులు ఉంటాయని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, క్యాబినెట్ సబ్-కమిటీ ఆమోదం పొందిన అనంతరం ఈ చారిత్రాత్మక బిల్లును త్వరలోనే రాష్ట్ర శాసనసభ (అసెంబ్లీ) ముందుకు తీసుకువస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

న్యాయపరంగా పటిష్టంగా ఉండాలి: ఈ చట్టానికి భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, సుప్రీంకోర్టు అడ్వకేట్, సామాజిక కార్యకర్త దిశా వాడేకర్‌ను ప్రత్యేక ఆహ్వానితురాలిగా పిలిపించి చర్చించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొలంబియా లా స్కూల్ (న్యూయార్క్) నుండి ఎల్.ఎల్.ఎమ్ పూర్తి చేసిన ఆమె అనుభవం చట్టాన్ని అత్యంత సమగ్రంగా, లోపరహితంగా తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# యుకె కు ఎగుమతులు పెంచుతాం

మొదటి పేజీ తరువాయి...

రెండు దేశాల మధ్య రూ.32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమికండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్సుడ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ్ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# కమిటీకి చట్టబద్ధత కల్పించాలి

మొదటి పేజీ తరువాయి...

మార్పులు వచ్చినా ఉద్యమకారుల హక్కులకు భంగం కలగకుండా ఈ చట్టబద్ధత అత్యవసరమని పేర్కొన్నారు.

కమిటీ సభ్యులు జిల్లాలకే రావాలి : సుదూర ప్రాంతాలైన ఆసిఫాబాద్, మంచిర్యాల వంటి సరిహద్దు జిల్లాల నుండి వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఉద్యమకారులు హైదరాబాద్ దాకా రాలేకపోతున్నారని ప్రతినిధులు కమిటీ దృష్టికి తెచ్చారు. అందువల్ల, కమిటీ సభ్యులే స్వయంగా జిల్లాలకు వచ్చి క్షేత్రస్థాయిలో ఉండి నిజమైన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని పట్టుబట్టారు. ఈ రెండు ప్రధాన డిమాండ్లతో పాటు, క్షేత్రస్థాయి యోధులు తమ ఇతర ఆత్మగౌరవ సంక్షేమ వినతులను కూడా కమిటీకి సమర్పించారు. అందులో భాగంగా: అర్హులైన ప్రతి కుటుంబానికి 250 గజాల నివాస స్థలం కేటాయించాలని,జీవన భృతి కోసం గౌరవప్రదమైన నెలవారీ పెన్షన్ అందించాలని,ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

వీటితో పాటు మహిళా ఉద్యమకారులకు ప్రత్యేక ప్రయోజనాలు, ఉచిత కార్పొరేట్ వైద్యం కోసం హెల్త్ కార్డులు, ఉచిత నాణ్యమైన విద్య, మరియు ఆర్టీసీ బస్సులలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వినతి పత్రాలు సమర్పించారు.

కమిటీ సభ్యుల సానుకూల స్పందన: ఉద్యమకారులు లేవనెత్తిన అంశాలపై కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు స్పందిస్తూ.. "మీ ప్రతిపాదనలు వందకు వంద శాతం న్యాయమైనవి. ఈ అంశాలను సమగ్ర నివేదికలో చేర్చి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి దృష్టికి తక్షణమే తీసుకెళ్తాం.

ఐఅండ్‌పీఆర్ డిజిటల్ రికార్డింగ్ సాక్షిగా ప్రతి ఒక్క నిజమైన పోరాట యోధునికి వడ్డీతో సహా న్యాయం జరిగేలా చూస్తాం" అని గట్టి భరోసా ఇచ్చారు.జూలై 22 వరకు ఈ ముఖాముఖి షెడ్యూల్ నిరంతరాయంగా కొనసాగుతుందని కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు గారు ముగింపు ప్రసంగంలో స్పష్టం చేశారు.

**మీడియా సెల్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ**

ఈ ముఖాముఖి కార్యక్రమం లో చైర్మన్ గారితో పాటు సభ్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీ ప్రొఫెసర్ కొందండ్ రామ్ గారు, శ్రీ మోతే శోభన్ రెడ్డి గారు, శ్రీ రాములు నాయక్ గారు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

మొదటి పేజీ తరువాయి...

సగం పూర్తికాకముందే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని కేటీ ఆర్ పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తుందన్నారు. వరంగల్ సభ అనంతరం, ఈనెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో 'యువ సంగ్రామ' సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీ ఆర్ ప్రకటించారు. గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సరూర్‌నగర్ యువజన సభ ఏర్పాట్లు, నిర్వహణపై చర్చించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని విమర్శించారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కాంలు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు, అనుసరిస్తున్న విధానాలు, పాలన ప్రజాకంటకంగా మారాయన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. రైతులు సాగునీటి కోసం అడుగుతుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి 'రక్తం పారిస్తా' అన్నట్లుగా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉండగా.. ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించాయని పేర్కొన్నా రు. చివరకు రైతులు కూడా 'మా రక్తాన్ని తీసుకోండి.. కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి' అని డిమాండ్ చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభు త్వం తీసుకొచ్చిందని విమర్శించారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులను కూడా చేపట్టామని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకే హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూలిశ్రీ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు.నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.జూలై నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంతో తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చలు జరిపి, దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయా యని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉన్నాయని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులపై కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి కాలేదని, డిండి ప్రాజెక్టు పనులు సగంలోనే నిలిచిపోయాయని, సీతారామ ప్రాజెక్టుపై రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు రాలేదన్నారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగ విద్యార్థుల సంక్షేమమే

# ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

**నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల కార్యాలయం, వసతి గృహంపై సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ**

**విద్య-ఆరోగ్యం-మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశం**



హైదరాబాద్, జూలై 16 (ప్రజాకలం) :

రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం, వారి విద్యాభివృద్ధి, జీవన ప్రమాణాల మెరుగుదలే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం నల్లగొండ ఎక్స్‌రోడ్స్‌లోని దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం, ప్రభుత్వ దివ్యాంగుల వసతి గృహం, పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమైన మంత్రి, మూగ-చెవిటి విద్యార్థులు సంకేత భాష ద్వారా తమ సమస్యలను వివరించగా ఎంతో శ్రద్ధగా ఆలకించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. విద్యార్థుల అవసరాలన్నింటినీ సమగ్ర ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు.

శాఖలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి తీవ్రంగా పరిగణించారు. ఖాళీ పోస్టుల వివరాలు, అవసరమైన బోధనా సిబ్బంది, ఇతర సౌకర్యాలపై వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని సహాయ సంచాలకుడు, విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగ విద్యార్థుల విషయంలో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అనే మూడు అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వసతి గృహంలోని ఆహారం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, తరగతి గదులు, బోధన సౌకర్యాలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తూ, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి దివ్యాంగ విద్యార్థికి నాణ్యమైన విద్య, మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి సమస్యను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా ప్రభుత్వానికి పంపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# పుష్కలంగా సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

## - ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: జూలై 16: (ప్రజా కలం న్యూస్)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు పనుల పురోగతిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి జలాలను గ్రావిటీ, లిఫ్ట్ విధానాల ద్వారా గరిష్టంగా వినియోగంలోకి తీసుకువచ్చి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీతారామ ప్రాజెక్టును సమగ్రంగా సమీక్షించి ఇప్పటికే జరిగిన పనులు వృథా కాకుండా అవసరమైన సాంకేతిక మార్పులతో వేగంగా పూర్తి చేసే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు.ప్రతి పైసా ప్రజా ధనాన్ని జాగ్రత్తగా వినియోగిస్తూ



ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువలు లింక్ కెనాల్స్ టన్నెల్స్ నిర్మాణంతో వైరా పాలేరు రిజర్వాయర్లను అనుసంధానిస్తూ సత్తుపల్లి వరకు సాగునీరు అందేలా పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నెలవారీ కార్యాచరణ ప్రణాళికతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి జిల్లా రైతాంగం దశాబ్దాల కలను సాకారం చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జిల్లా కలెక్టర్ అంకిత్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత కార్యక్రమాలకు శ్రీకారం



## "ప్రజాకలం" వార్తకు స్పందించిన మున్సిపల్ అధికారులు

### - వీధి పందులు, కుక్కల సమస్యపై తక్షణ చర్యలు..

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 16 (ప్రజా కలం) పట్టణంలో వీధి పందులు, కుక్కల సమస్యపై "అటు పందులు... ఇటు కుక్కలు..!" శీర్షికతో ప్రజాకలం దినపత్రిక ప్రచురించిన సమగ్ర కథనానికి మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించారు. వార్త ప్రచురితమైన అనంతరం సంబంధిత వార్డుల్లో పరిశుభ్రత చర్యలను వేగవంతం చేసి, బ్లీచింగ్ చల్లించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు వీధి జంతువుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. అదేవిధంగా, వీధుల్లో స్వైర విహారం చేస్తున్న పందులు, కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలతో చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమస్యను ప్రజల తరపున అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ స్పందనకు కారణమైన "ప్రజాకలం" దినపత్రికను స్థానికులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.




# పత్తి, మొక్కజొన్న పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం

గొల్లపల్లి జూలై 16 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామంలో వ్యవసాయ అధికారి కరుణ ఏ.ఓ సంధ్య రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన వ్యూహాలపై రైతులకు గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూవర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందకుండా, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటలను సురక్షితంగా కాపాడుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న పంటలు మొలక దశలో ఉన్నాయని ఈ కీలక సమయంలో రైతులు పత్తి సాగులో రసం పీల్చు పురుగుల తెల్లదోమ, తామర పురుగులు, జాసిడ్స్ ఉధృతిని గమనిస్తూ ఉండాలి. ఇవి ఆర్థిక నష్ట పరిమితి దాటినట్లు గుర్తిస్తేనే పురుగుల మందుల పిచికారీ చేయాలని నేలలో తగినంత తేమ లేనందున, వర్షాలు పడి తేమ పదును వచ్చే వరకు ఎరువులు వేయకూడదని సూచించారు. పొలంలో కలుపును నివారించడంతో పాటు, భూమిలో ఉన్న తేమ ఆవిరి కాకుండా కాపాడుకోవడానికి తరచూ అంతరకృషి (గుంటక,దంతెలు తోలడం) చేయాలి అని సూచించారు.



పొడి వాతావరణం కారణంగా మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించే ప్రమాదం ఎక్కువగా ఉందని ఏఓ హెచ్చరించారు. దీని నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక మధ్యస్థ దశలో లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె (1500 పి.పి. ఎం) కలిపి పిచికారీ చేయాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 0.3 గ్రాముల ఎమామెక్టిన్ బెంజోయేట్ లేదా 0.4 మిల్లీలీటర్ల ఇమామిడాక్లోప్రిడ్ కలిపి పంటపై చల్లాలని అన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల నుండి పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఈ క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల సౌందర్య,ఉపసర్పంచ్ చెవుల తిరుపతి , రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# భద్రత లేని చోట విద్యాబోధన

### - మోడల్ స్కూల్‌లో విద్యార్థి మృతి

పెద్దపల్లి,జూలై 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా రామగుండం లింగాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో క్రీడల సమయంలో ఎనిమిదో తరగతి విద్యార్థి వెంచర్ల సాత్విక్ బావిలో పడి మృతి చెందడం పట్ల టీఎన్ఎస్ఎఫ్ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ఎండీ వాజిద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ,ఇది ప్రభుత్వం మరియు పాఠశాల యాజమాన్యం,పీఈటీ ల ఉమ్మడి నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. పేరుకే మోడల్ స్కూల్ అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, విద్యార్థుల కనీస భద్రత కోసం పాఠశాల ఆవరణలో కనీసం 6 నుండి 7 అడుగుల ఎత్తు గల ప్రహరీ గోడను కూడా నిర్మించకపోవడం వల్లే ఈ అపశృతి చోటుచేసుకుందని ఆయన ధ్వజమెత్తారు. ఒకవేళ సరైన రక్షణ గోడ ఉండి ఉంటే సాత్విక్ ఆడుకుంటున్న బంతి బయటకు వెళ్లేది కాదు,ఆ విద్యార్థి ప్రాణాలు దక్కేవి అని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యల పేరుతో కేవలం ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని స్పష్టం చేసిన వాజిద్,మృతుడి కుటుంబానికి 30 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని,అలాగే సాత్విక్ తండ్రికి ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో భద్రతా లోపాలను సరిచేయాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.




# గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత



జగిత్యాల ప్రతినిధి జులై 16 (ప్రజాకలం)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూసర్వే రీ-సర్వే కార్యక్రమాన్ని గ్రామ సభల ద్వారా వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మపురి, గొల్లపెల్లి మండలాల పరిధిలోని నాగారం, అబ్బాపూర్ గ్రామాల్లో భూముల రీ-సర్వేకు సంబంధించిన అవగాహన సదస్సులు (గ్రామ సభలు) ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూసర్వే-రీ-సర్వే ప్రక్రియ, సర్వే యాక్ట్-1923 నిబంధనలు, సర్వే నిర్వహణ విధానం, రైతులు పాటించాల్సిన అంశాలపై గ్రామ రైతులు, ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. గ్రామ సభల ద్వారా ప్రజల్లో సందేహాలను నివృత్తి చేసి, రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి, గొల్లపెల్లి తహసీల్దార్లు శ్రీనివాస్, మాజీద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విదేశీ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు

### - జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

పెద్దపల్లి,జూలై 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని దుబాయ్‌లో గల ఒక ప్రముఖ కంపెనీలో ఖాళీగా ఉన్న విదేశీ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలం గాణ ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ అయిన తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నియామకాలు జరుగుతాయని,ప్రస్తుతం క్లీనర్స్,టైల్ మేసన్,ఆల్ రౌండర్ మేసన్, బ్లాక్/ప్లాస్టర్ మేసన్, స్టీల్ ఫిక్సర్, షట్టరిం గ్ కార్పెంటర్, ప్లంబర్,ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్, పెయింటింగ్ కార్పెంటర్,మిగ్ వెల్డర్,జనరల్ హెల్పర్ విభాగాల్లో మొత్తం 500 మంది అభ్యర్థుల అవసరం ఉందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నైపుణ్య గ్రేడ్ ప్రకారం ఓవర్ టైంతో పాటు వేతనం అందించబడుతుందని,వసతి, రవాణా,భోజన సౌకర్యం యజమాని ద్వారా కల్పించబడుతుందని,రోజుకు 9 గంటల పని,అదనంగా ఓవర్ టైం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ట్రేడ్లలో అనుభవం కలిగి ఉండాలని సూచించారు. ఈ నియామక ప్రక్రియ వాక్-ఇన్ ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుందని,ఇంటర్వ్యూలు జూలై 21న హైదరాబాద్‌లోని మసాబ్ ట్యాంక్ సమీపంలో ఉన్న టామ్ కామ్ కార్యాలయంలో నిర్వహించబడుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, పాస్‌పోర్ట్, విద్యార్హత,అనుభవ ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని,మరిన్ని వివరాలకు 8328602231, 9440050951,9440051452 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు చేయాలి

### - మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి

### - మెట్‌పల్లిలో బీఆర్ఎస్ బి ఎల్ ఏ లకు ఓటర్ జాబితా సవరణపై అవగాహన



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 16 (ప్రజా కలం) అర్హులైన ప్రతి ఒక్కరి ఓటరు నమోదుపై దృష్టి సారించాలని మాజీ మంత్రి టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మెట్‌పల్లి పట్టణంలోని విధిత్ రెడ్డి గార్డెన్స్‌లో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్ల కోసం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ లతో కలిసి హాజరైన జీవన్ రెడ్డి బి ఎల్ ఏ లకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు అందేలా చూడడంలో బి ఎల్ ఎ ల బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఓటర్ జాబితా సవరణను అత్యంత బాధ్యతతో నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా అనర్హమైన నమోదులు, డూప్లికేట్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లు వంటి అంశాలను చట్టబద్ధంగా గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో బి ఎల్ ఏ ల పాత్ర కీలకమని, ప్రతి కార్యకర్త పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అండగా నిలవాలని నాయ కులు కోరారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అధ్యయనం చేసి, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ బి ఏల్ ఏ లు, ప్రజాప్రతినిధులు, మండల, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాచ్ ది రైన్ ప్రచారంలో జల ప్రతిజ్ఞ

### ప్రతి ఇంటా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి - మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 16 (ప్రజా కలం) జల సంచయ్ జన భాగీదారి 3.0 కార్యక్రమంలో భాగంగా, సీడీఎంఏ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "క్యాచ్ ది రైన్" ప్రచార కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ గుంతలు (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పిట్స్)పై అవగాహన కార్యక్రమాన్ని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వర్షపు నీటి బొట్టును సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను కాపాడడంతో పాటు భావితరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. స్థిరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, ముఖ్యంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వినియోగించాలని సూచించారు. "ఈరోజు వర్షపు నీటిని సంరక్షిద్దాం... రేపటి నీటి భద్రతను కాపాడుకుందాం" అనే నినాదంతో ప్రజలందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తే భూగర్భ జలాల మట్టం పెరిగి, భవిష్యత్తులో నీటి నమస్యను అధిగమించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నాయకులు అరిసె మురళి, ఆర్‌పీలు శోభ, సరోజ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# ఇదిగో మా రక్తం తీసుకో..

### - మా రైతుల పొలాల్లో నీళ్లు పారించు సీఎం

### - రక్తదానం చేస్తూ భావోద్వేగానికి గురైన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశం కర్

### - రైతుల నీరు అందిం చేందుకు కంటతడి

కరీంనగర్ ప్రతినిధి జులై 16 (ప్రజా కలం) "మా రక్తం కావాలంటే తీసుకోండి కానీ మా రైతు ల ప్రాణాలు కాపాడండి గో దావరి నీళ్లు సముద్రంలో కలవకుండా పొలాలకు చే రేలా చేయండి" అంటూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ రక్తదాన శిబిరంలో భావోద్వేగ వ్యాఖ్యలు చే శారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధుర నగర్‌లో నిర్వహించిన రక్త దాన శిబిరంలో రక్తదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతు బాధ ను రాజకీయాలకు అతీ తంగా చూడాల్సిన అవస రం ఉందన్నారు. ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టు, సాగు నీటి అంశాలపై తెలంగా ణలో రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యం లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మా రక్తం తీసు కోండి కానీ రైతుల రక్తం, చెమట వృథా కాకుండా చూడండి. పంటలు ఎండిపో కుండా నీళ్లు ఇవ్వండి. రై తు కన్నీరు తుడవండి. ఇ దే మా విజ్ఞప్తి" అని ఆయ న ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థి తులు, సాగునీటి కొరతపై రైతుల్లో తీవ్ర ఆందోళన నె లకొందని పేర్కొంటూ, ఇలాంటి సమయంలో రాజ కీయ ఆరోపణలు కాకుం డా రైతులకు నీరు అందిం చే చర్యలపైనే ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వ హ యాంలో సాగునీటి విస్తర ణ, రైతు సంక్షేమ పథకా లు తెలంగాణ వ్యవసా య రంగానికి బలాన్ని ఇ చ్చాయని పేర్కొన్న ఆయ న,ప్రస్తుతం రైతులు మళ్లీ నీటి కోసం ఎదురుచూడా ల్సిన పరిస్థితి రావడం బా ధాకరమన్నారు. "రైతు బ తికితేనే తెలంగాణ బతుకుతుంది. గోదావరి నీళ్లు కళ్ల ముందే సముద్రంలో క లుస్తుంటే రైతు పొలాలు ఎండిపోవడం మనందరికీ బాధ కలిగించాలి. రైతు ప్రాణాల కంటే గొప్ప రాజకీయాలు ఏవీ కావు" అని అన్నారు. ప్రభుత్వం వెంట నే సాగునీటి సమస్యపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, రైతుల అవసరాలకు అ నుగుణంగా నీటి నిర్వహ ణపై దృష్టి పెట్టాలని కో రారు. కరువు పరిస్థితులు మరింత తీవ్రం కాకముందే రైతులకు అండగా నిల వాలని ప్రభుత్వానికి విజ్ఞ ప్తి చేశారు. "మా రక్తం కావా లంటే ఇస్తాం కానీ మా రై తుల ప్రాణాలు కాపాడం డి. వారి పొలాల్లో పచ్చ దనం చూడటమే మా కో రిక. రైతు నవ్వితేనే తెలం గా ణ నవ్వుతుంది" అంటూ సుంకె రవిశంకర్ భా వోద్వేగంగా వ్యాఖ్యలు చే శారు.




# ఘనంగా రాయల చంద్రశేఖర్ వర్ధంతి




పెద్దపల్లి,జూలై 16 (ప్రజాకలం జిల్లాప్రతినిధి) సమాజ మార్పు కోసం,కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఆఖరి వరకు అలుపెరగక పోరాడిన విప్లవ యోధుడు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ రాయల చంద్రశేఖర్ అని సీపీఐ-ఎంఎల్ మాస్ లైన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ కొనియాడారు. గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ అధ్యక్షతన రాయల చంద్రశేఖర్ రెండవ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జూపాక శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ మార్పు కోసం,కేంద్ర ప్రభుత్వ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా చివరి వరకు పోరాడిన విప్లవ యోధుడు చంద్రశేఖర్ అని,ఆయన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రాయల వెంకటనారాయణ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని నూతన విప్లవానికి అంకితమయ్యారని పేర్కొన్నారు. డిగ్రీ చదువుతుండగానే ఎమర్జెన్సీ కాలంలో అజ్ఞాతంలోకి వెళ్లిన చంద్రశేఖర్,అనంతరం పార్టీ రైతు సంఘం జాతీయ నాయకుడిగా ఇల్లందు,మహబూబాబాద్,వరంగల్,హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో విశేష సేవలు అందించారని,అతివాద,మితవాద పంథాలకు వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటం చేస్తూ ప్రజాపంథానే సరైన మార్గమని నమ్మారని తెలిపారు. ఆదివాసీల హక్కుల కోసం,ఢిల్లీ రైతు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన చంద్రశేఖర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని,నేటి ప్రజా,కార్మిక,రైతాంగ వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు తోకల రమేష్,ఈసంపల్లి రాజేందర్,ఆడెపు శంకర్,గొల్లపల్లి చంద్రయ్య,మార్త రాములు, బుషిపాక దేవయ్య,కోడిపుంజుల లక్ష్మి,మార్త రాధ,ఇనుగాల రాజేశ్వర్,కలువల రాయమల్లు,క్రాంతి,రాజయ్య,దీవెనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వే పారదర్శకంగా నిర్వహిస్తాం

### - జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత

గొల్లపల్లి జూలై 16 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలో భూ రీ సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని అబ్బాపూర్, అగ్గిమల్ల, బొంకూర్ , భీంరాజుపల్లి గ్రామాలు ఎంపిక చేయగా గురువారం అబ్బాపూర్ గ్రామంలో తహసీల్దార్ మజీద్ గ్రామ సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.యస్. లత హాజరై వారు మాట్లాడుతూ భూ రిసర్వే ద్వారా భూముల సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పక్కగా నిర్వహించి సర్వే రికార్డులను నవీకరించి డిజిటల్ రూపంలో అందుబాటులోకి తెస్తామని భూ వివాదాలు సరిహద్దు తగాదాలను తగ్గించిప్రతి భూమికి సరైన విస్తీర్ణం, హద్దులు నమోదు చేసి రైతులు ,భూ యజమానులకు పారదర్శకమైన భూ రికార్డులు అందించిభూలావాదేవీలు, వారసత్వ మార్పులు , ప్రభుత్వ సేవలను సులభతరం చేసిభూ పరిపాలనను మరింత సమర్థవంతంగా,పారదర్శకంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వఏ ఎం సి చైర్మెన్ భీమా సంతోష్ ,తహశీల్దార్,మజీద్ ఎంపిడి ఓ, రవీందర్,స్థానిక సర్పంచ్ సౌందర్య , గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు




# ప్రమాద నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

రుద్రంగి, జూలై 16,(ప్రజాకలం ప్రతినిధి) రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని రుద్రంగి పోలీస్ స్టేషన్ ఎస్సై మోతిరాం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో గురువారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ లేకుండా రోడ్డుపైకి రావద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటి నిర్లక్ష్య చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై మోతిరాం పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



ప్రజా కలం

శుక్రవారం, జూలై 17, 2026

# వన్ నేషన్-వన్ ఎలక్షన్

భారత రాజకీయ యవనికపై అత్యంత భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం వేదిక సిద్ధం చేస్తోంది. ఒకేసారి మూడు చారిత్రాత్మక సంస్కరణలను అమల్లోకి తెచ్చేందుకు చట్టసభల్లో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. వన్ నేషన్-వన్ ఎలక్షన్ , నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం పార్లమెంట్‌లో ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలను సంపూర్ణంగా మార్చేయబోతున్నాయి. ఈ మూడు బిల్లుల కలయిక కేవలం ఎన్నికల సంస్కరణ మాత్రమే కాదు, ఇది భారత ఫెడరల్ నిర్మాణాన్ని, ప్రాతినిధ్య రాజకీయాలను సరికొత్త దిశకు తీసుకెళ్లే ఒక సుదీర్ఘ ప్రయాణం.దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే వన్ నేషన్-వన్ ఎలక్షన్ బిల్లు భారత ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని, శ్రమను భారీగా తగ్గించడమే లక్ష్యంగా తెస్తున్నారు. పార్లమెంటరీ సంయుక్త కమిటీ అంచనాల ప్రకారం.. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 7 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వల్ల నిలిచిపోయే అభివృద్ధి పనులకు విముక్తి లభిస్తుంది. అయితే, మధ్యలో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అక్కడ కొత్తగా ఎన్నికయ్యే సభ కేవలం మిగిలిన కాలపరిమితి కి మాత్రమే పరిమితం అవుతుందనే ప్రతిపాదన ప్రాంతీయ పార్టీలలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానాన్ని 2029 కల్లా పూర్తి స్థాయిలో అమల్లోకి తేవాలని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల పరిమితిని సవరించి, నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం ప్రతిపాదించిన చట్టాల ప్రకారం.. లోక్‌సభ గరిష్ట స్థానాల సంఖ్యను 550 నుండి ఏకంగా 850కి పెంచే అవకాశం ఉంది. ఎవరికీ అన్యాయం జరగకుండా యాభై శాతం సీట్ల ఫార్ములాను తీసుకు వచ్చింది. గతంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కావాలంటే జనాభా లెక్కలు, పునర్విభజన పూర్తి కావాలనే నిబంధన ఉండేది. కానీ, తాజా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే మహిళా కోటాను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాబోయే 2029 సాధారణ ఎన్నికల నాటికి లోక్‌సభ , రాష్ట్రాల అసెంబ్లీలలో 33 శాతం స్థానాలు మహిళలకే దక్కుతాయి. ఇది భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని క్రింది స్థాయి నుండి అగ్రస్థాయి వరకు అనూహ్యంగా పెంచే విప్లవాత్మక మార్పు కానుంది. ఈ మూడు మహా బిల్లులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. పునర్విభజన జరిగితేనే పెరిగిన సీట్లలో మహిళా రిజర్వేషన్లు పక్కాగా అమలవుతాయి, ఆ సీట్ల ఆధారంగానే వన్ నేషన్-వన్ ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఈ స్థాయి భారీ రాజ్యాంగ సవరణలు కేవలం పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సాధ్యం కాదు. దీనికి రెండు పద్ధతుల ప్రత్యేక మెజారిటీ తో పాటు కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ప్రాంతీయ పార్టీలను ఒప్పించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటం, ఒకేసారి దేశవ్యాప్తంగా ఈవీఎంల సరఫరా వంటి భారీ లాజిస్టికల్ సవాళ్లు కేంద్రం ముందున్నాయి. లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. భారీగా ప్రభుత్వ ధనం వృథా తగ్గి.. ఖర్చులు కలిసి వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటే పరిపాలనపై ప్రభావం పడుతుంది.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే.. సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు తరచూ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడం కూడా తగ్గుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్లు ఒకేసారి వచ్చి ఓటింగ్ వేయడం వల్ల పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని లా కమిషన్ వెల్లడించింది.అయితే ఈ జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సహా ఇతర పార్లమెంటరీ ప్రొసీజర్లను కూడా సవరించాల్సి ఉంటుంది. దీని కోసం రాష్ట్రాల అంగీకారం కూడా కావాల్సి ఉంటుంది. ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ అంశాలే అధిక ప్రాధాన్యత కలిగి ఉండి.. స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా భయపడుతున్నాయి. దీనికి తోడు ఎన్నికల ఖర్చులో కూడా జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి రావడం మరింత ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నాయి. అయితే 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేయనున్నారని తేలింది. అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేర్వేరుగా నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దుకావడం, 1970 లో ఏడాది ముందే లోక్‌సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది. అయితే 1983 లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలీ ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చినా.. ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. 1999 లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా అది ఆచరణలోకి రాలేదు. 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ జమిలీ ఎన్నికల ఆలోచనను ప్రతిపాదించగా.. 2017 లో నీతి ఆయోగ్ కసరత్తు చేసింది. 2019 లో ఈ అంశంపై వివిధ పార్టీల నేతలతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయగా.. కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు హాజరు కాలేదు. అయితే 2022 లో జమిలీ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమేనని సీఈసీ సుశీల్ చంద్ర ప్రకటించారు. 2022 డిసెంబర్‌లో జమిలీ ఎన్నికలపై లాకమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు, విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించింది.ఇవన్నీ దాటుకుని బిల్లులు చట్ట రూపం దాలిస్తే, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది సరికొత్త అధ్యాయం అవుతుంది. అయితే దీనికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ ను ఎన్డీఏ పెద్దలు ఇప్పటికే పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది.

# ఆరుతడి పంటల సాగుతోనే అధిక దిగుబడులు

## - రైతులకు ఉచిత విత్తనాలు..పరికరాల పంపిణీ



పాలకుర్తి,జూలై 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఎల్‌నినో' ప్రభావం ఉండే అవకాశం ఉందని,దీనివల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో సాగునీటి లభ్యత తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున,రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.శ్యాం ప్రసాద్ సూచించారు.పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ,ఉద్యానవన శాఖ,రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వానకాలం 2026 సీజన్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా వాతావరణ మార్పులపై అధికారులు రైతులకు దిశానిర్దేశం చేశారు.ఈ సీజన్‌లో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున జలాశయాలు,చెరువులు నిండక నీటి లభ్యత గణనీయంగా తగ్గుతుందని,బోర్లలో భూగర్భ జలాలు కూడా త్వరగా అడుగంటే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ,రైతులు వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే జొన్న,పెసలు, మినుములు, కంది,పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయాబీన్,ఆముదం,రాగులు వంటి ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు.రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి పాల్గొని తక్కువ రోజుల్లో పంటలు పండించుకోవాలని కోరగా,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.శ్యాం ప్రసాద్ ఆయిల్ పామ్ సాగుతో రైతులకు రెట్టింపు లాభాలు వస్తాయని వివరించారు.ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు ఉచితంగా రాగి విత్తనాలతో పాటు రూ.2వేల విలువైన కలుపు తీసే యంత్రాలు మరియు ఎస్టీ రైతులకు ఇంటి పెరటి తోటల కోసం ఉచిత కూరగాయ విత్తనాల కిట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఓ.సంపత్,పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల,ఉద్యానవన శాఖ అధికారి ఏ.జ్యోతి,హెచ్.ఈ.ఓ బి.రాము,ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రశాంత్, ఏ.ఈ.ఓలు ఎం.సువర్ణరేఖ,కే.శ్రీకాంత్, జే.సుష్మ తోపాటు రైతులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ సాగుతోనే లాభాలు

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,జూలై 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా సాగు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ నిర్వహించిన అంచనాల ప్రకారం 207 గ్రామాలు మోస్తరు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని,అయితే తీవ్ర ప్రభావం లేదా స్వల్ప ప్రభావం ఉన్న గ్రామాలు ఏవీ లేవని కలెక్టర్ తెలిపారు.జూలై 15 నాటికి జిల్లాలో మొత్తం 91,136 ఎకరాల్లో పంటల సాగు అంచనా వేయగా,ఇందులో 10,510 ఎకరాలు వర్షాధార పంటలు,80,626 ఎకరాలు సాగునీటి ఆధారిత పంటలు ఉన్నాయని తెలిపారు.ఇంకా 1,84,671 ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జూలై 16 నుంచి 31 వరకు జిల్లాలో 89,892 ఎకరాల్లో వివిధ పంటల సాగుకు వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని కలెక్టర్ తెలిపారు.ఇందులో 84,500 ఎకరాల్లో వరి, 1,814 ఎకరాల్లో కందులు,1,182 ఎకరాల్లో పెసల్లు,186 ఎకరాల్లో మినుములు,136 ఎకరాల్లో అలసందలు,16 ఎకరాల్లో ఉలవలు,8 ఎకరాల్లో ఆముదం,925 ఎకరాల్లో మొక్కజొన్న,3 ఎకరాల్లో పశుగ్రాస జొన్న,471 ఎకరాల్లో కూరగాయలు,651 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నట్లు తెలిపారు.ప్రతిపాదిత సాగుకు అవసరమైన 17,259.03 క్వింటాళ్ల విత్తనాలకు గాను జిల్లాలో ఇప్పటికే 21,564.44 క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.రైతులకు విత్తనాల కొరత తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని,తక్కువ కాలంలో దిగుబడి వచ్చే ప్రత్యామ్నాయ పంటలు,వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల సాగుపై సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పంటల ఎంపిక, విత్తనాల వినియోగం,సాగు విధానాలను పాటిస్తూ సకాలంలో విత్తనాలు వేసుకోవాలని,ఏవైనా సందేహాలు ఉంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు.

# రీ-సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా భూముల సర్వే





పెద్దపల్లి,జూలై 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

భూ భారతి కింద చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి,భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.గురువారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభ లో భూభారతి-రీ-సర్వే అవగాహన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా ఇప్పటికే అనేక భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.

భూముల విస్తీర్ణంలో తేడాలు,ఇతర భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో చివరిసారిగా 1937లో భూ సర్వే జరిగిందని,ప్రస్తుతం ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సమగ్ర రీ-సర్వే నిర్వహించాలని ఆదేశించిందని తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో మొత్తం 190 రెవెన్యూ గ్రామాలు ఉండగా,మొదటి దశలో 70 గ్రామాలను రీ-సర్వే కోసం ఎంపిక చేసినట్లు,అందులో సబ్బితం గ్రామం కూడా ఒకటని పేర్కొన్నారు.రీ-సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి,అనంతరం ఇళ్లు,ప్రభుత్వ ఆస్తులు,వ్యవసాయ భూములను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేస్తామని తెలిపారు.సర్వే ప్రక్రియను ఆధునిక యంత్రాల సహాయంతో పూర్తి స్థాయిలో నిర్వహిస్తామని వెల్లడించారు.సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి ప్రజలకు 21 రోజుల గడువు ఇస్తామని,అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు.పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వే ద్వారా 99 శాతం సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.గ్రామాల్లో రీ-సర్వే జరుగుతున్న సమయంలో ప్రజలు అందుబాటులో ఉంటూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.రోజుకు సుమారు 40 నుంచి 50 ఎకరాల వరకు సర్వే నిర్వహిస్తామని,ఏ భూములను సర్వే చేయనున్నారనే సమాచారాన్ని ముందుగానే అందిస్తామని,సంబంధిత రైతులు నిర్దేశిత సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు.రీ-సర్వే ద్వారా రూపొందించే భూ వివరాలు రాబోయే 60 నుంచి 70 సంవత్సరాల వరకు ఉపయోగపడేలా ఉంటాయని కలెక్టర్ తెలిపారు.ఆధార్ తరహాలో భూధార్ కార్డుల జారీకి ఈ రీ-సర్వే కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, సర్పంచ్ నూనె సరోజన,సర్వేయర్ లు,రెవెన్యూ అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గంగనాల ఆయకట్టుకు నీటి విడుదల



ఇబ్రహీంపట్నం జూలై 16 (ప్రజా కలం ప్రతినిధి)

ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామ శివారులో గోదావరి నది తీరాన ఉన్న గంగనాల ఆయకట్టు కాలువకు గురువారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. ముందుగా గోదావరి తల్లికి తెప్ప సమర్పించి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజాప్రతినిధులు, అభివృద్ధి కమిటీ సభ్యులు గేట్ ద్వారా కాలువలోకి నీటిని విడుదల చేశారు.

గంగనాల ఆయకట్టు కింద ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్ కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుడ, మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం, శ్రీరాంపూర్, దాంరాజ్‌పల్లి గ్రామాలకు సాగునీరు అందుతోంది. ఈ ఆయకట్టు కింద సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందుతున్నట్లు తెలిపారు. వానాకాలం, వేసవికాలంలో రైతులు ఈ ఆయకట్టు కింద వివిధ పంటలను సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం నీటి విడుదలతో రైతులు వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తరి రామానుజం, సహకార సంఘం చైర్మన్ అంకతి రాజన్న, అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎడిపెల్లి మురళి, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మెగిలి దేవదాస్, కోశాధికారి అన్నరపు రాజారెడ్డి, రైటర్ పెంట మహేష్, అభివృద్ధి కమిటీ సభ్యులు అంకతి రాజలింగం, కుమ్మరిపెల్లి మల్లేశం, పల్లి పెద్దలు, జిల్లా ఆనందం, అల్లెపు మహేష్, మాలేపు లక్ష్మణ్, సిలివేరి మహేష్, అక్కపెల్లి గంగాధర్, కనపర్తి నరేష్, పట్నం నర్సయ్య, గుడ్ల శ్రావణ్, మగ్గిడి గంగాధర్, లష్కర్ తోకల గణేష్, తోకల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉరివేసుకొని వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం జూలై 16 (ప్రజా కలం ప్రతినిధి) ఇబ్రహీంపట్నంమనస్తాపం చెంది ఉరివేసుకొని ఓ వ్యక్తి మరణించినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యామపూర్ గ్రామానికి చెందిన బాస బుచ్చన్న గత కొంతకాలంగా మద్యం తాగుడుకు బాని సై బుధవారం రాత్రి 11 గంటల సమయంలో మృతుడి భార్య అయిన బాస లక్ష్మి మద్యం తాగడం మానేయమని మందలించగా దానికి మనస్థాపం చెందిన మృతుడు మృతుడి ఇంటి బయట గల బాత్రూంలోని ఇనుప పట్టికి చీరతో ఊరికి పెట్టుకొని మరణించినట్లు పోలీసులు తెలిపారు. అతని తండ్రి మృతిపై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి కొడుకు బాస రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ ఐ తెలిపారు.

# పెన్షన్ ఇప్పిస్తానంటూ వృద్ధురాలిని మోసం చేసి నగల అపహరణ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 16 (ప్రజా కలం): కోరుట్ల బస్టాండ్ వద్ద సిరికొండ గ్రామానికి చెందిన అల్లే భగీర్థ (80) అనే వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తి మోసగించి ఆమె మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు హారాన్ని అపహరించిన ఘటన చోటుచేసుకుంది. కోరుట్ల ఎస్ ఐ చిరంజీవి కథనం ప్రకారం వృద్ధురాలి వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి నీకు రూ.4,000 పెన్షన్ వస్తుందా? రాకపోతే నాతో బ్యాంకుకు రండి, ఇప్పిస్తాను అని నమ్మబలికాడు. అనంతరం ఆమెను కోరుట్లలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్దకు తీసుకెళ్లి, బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి వస్తానని చెప్పాడు.కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి, మీ ఒంటిపై బంగారు ఆభరణాలు ఉంటే పెన్షన్ మంజూరు చేయరు.. అంటూ వృద్ధురాలి మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు హారాన్ని తీసుకున్నాడు. అనంతరం అప్లికేషన్ ఫారం తీసుకొస్తానని చెప్పి అక్కడి నుంచి పరారయ్యాడు.బాధితురాలు అల్లే బకీర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల మాటలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల ఎస్ ఐ చిరంజీవి సూచించారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 16 (ప్రజా కలం): కోరుట్ల పట్టణంలోని ఎకిన్‌పూర్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ (పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రుద్రంగి నుంచి నిజాంబాద్‌కు అశోక్ లేలాండ్ వాహనంలో సుమారు రూ.60 వేల విలువైన 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు గుర్తించి వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ ఘటనలో వాహనం, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనం, బియ్యం యజమాని రుద్రంగి గ్రామానికి చెందిన సుల్తాను సురేష్ (35)పై కేసు నమోదు చేసినట్లు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

# యువతరానికి మార్గదర్శకుడు కోట కిరణ్

## భార్య జన్మదినం సందర్భంగా రక్తదానం చేసి మరోసారి ఆదర్శం

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 16 (ప్రజా కలం) సమాజ సేవకు చిరునామాగా నిలిచిన కోట కిరణ్ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. 1995లో కొంతమంది స్నేహితులతో కలిసి స్నేహలయ ఫ్రెండ్స్ అసోసియేషన్‌ను స్థాపించిన ఆయన, అప్పటి నుంచి రక్తదానం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ, నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మెట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో యువతకు, యువజన సంఘాలకు మార్గదర్శిగా నిలుస్తున్నారు. 50 ఏళ్ల వయస్సులోనూ కోట కిరణ్ రక్తదాన సేవలను నిరంతరం కొనసాగిస్తూ, రక్తదానం ప్రాముఖ్యతపై



ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా, పలువురిని రక్తదానానికి ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. తన సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే జీవిత భాగస్వామి కోట ధనలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదానం చేయాలని నిర్ణయించిన కోట కిరణ్, అదే సమయంలో శ్రీ శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భాగ్యలక్ష్మి అనే మహిళకు అత్యవసరంగా అవసరమైన ఓ పాజిటివ్ రక్తాన్ని అందించి ప్రాణదాతగా నిలిచారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న కోట కిరణ్ దంపతులను స్థానికులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తి మరెందరికో ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

# కాళేశ్వరం ఉన్నా కరువు ఎందుకు..?

## - ప్రాజెక్టుల నిర్వహణలో సర్కారు విఫలం - గోదావరి పారినా గడప దాటని సాగునీరు

## - బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్

పెద్దపల్లి,జూలై 16: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)



రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులతో రైతాంగం అల్లాడుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమల్ల రాకేష్ కుమార్ ధ్వజమెత్తారు. గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జిల్లాలో సాగునీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు.గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా,ఈసారి అది కేవలం 12 వేల ఎకరాలకే పరిమితమైందని రాకేష్ కుమార్ గణాంకాలతో సహా వివరించారు.డీ-83, డీ-86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడం,ఎల్లమ్మ చెరువుతో సహా జిల్లాలోని పలు చెరువులు ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు.20 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఇది తాగునీటి అవసరాలకే సరిపోని దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.గోదావరిలో లక్షలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా,వాటిని ఒడిసిపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.గత ప్రభుత్వం నిర్మించిన మిషన్ కాకతీయ,మిషన్ భగీరథ,కాళేశ్వరం ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నా,నేడు సరైన నిర్వహణ లేక ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయని ఆరోపించారు. సమీపంలోనే గోదావరి ప్రవహిస్తున్నా, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నింపి,ఎల్లంపల్లికి నీటిని తరలించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పత్తిపాక రిజర్వాయర్ పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయి, ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధిని పక్కనపెట్టి పదవుల పంపకాల పంచాయతీల్లోనే మునిగిపోయారని దుయ్యబట్టారు.రక్తం చిందితే పంటలు పండుతాయి అని ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ,పంటలు పండుతాయి అనుకుంటే,ఎవరి రక్తం వాడాలో ప్రజలే నిర్ణయిస్తారు అంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన రాకేష్ కుమార్,రైతు భరోసా,సన్న బియ్యం బోనస్,ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే,రైతుల పక్షాన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్,మాజీ వైస్ చైర్మన్ మోబిన్,మాజీ కౌన్సిలర్ స్వామి,మేకల కుమార్ యాదవ్, కర్రె దేవేందర్ రెడ్డి,ఉప్పు శివ కుమార్, పోసాని శ్రీనివాస్ యాదవ్,బోయిని మనోజ్,కంచి నాగరాజు,పాయిలి కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి అండగా 1999-2000 పదో తరగతి పూర్వ విద్యార్థులు



( వరంగల్/పర్వతగిరి) జులై 16, ప్రజాకలం ప్రతినిధి రోడ్డు ప్రమాదంలో మరణించిన స్నేహితుని కుటుంబానికి మేమున్నామంటూ 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. పర్వతగిరి మండల కేంద్రంలోని విశ్వ జెనిత్ స్కూల్ కరెస్పాండెంట్ ఎర్రబెల్లి హరికుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. గురువారం హరికుమార్ దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాఠశాల స్నేహితులు (1999-2000 టెన్త్ క్లాస్ బ్యాచ్) పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హరితో తమకున్న పాత జ్ఞాపకాలను, స్నేహాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం, ఆర్థికంగా ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచేందుకు స్నేహితులంతా కలిసి ఒక నిర్ణయం తీసుకున్నారు. హరి కుమార్తె ఆధ్యశ్రీ భవిష్యత్తు కోసం రూ. 1,00,000 (అక్షరాలా లక్ష రూపాయలు) సేకరించి, పోస్టల్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ డిపాజిట్ పత్రాలను హరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకున్న పూర్వ విద్యార్థుల ఉదారతను స్థానికులు, గ్రామస్తులు అభినందించారు.

## భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జూలై 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ, మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీ సర్వే ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మొత్తాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటిలభ్యత, వర్షాలను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్ నరసింహ మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు పెద్దపీట వేసిన తెలంగాణ రక్షణ సేన

### - పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియామకం



పెద్దపల్లి,జూలై 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప,వారికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో విఫలమయ్యాయని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు బొంగోని శంకర్ గౌడ్,ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు.ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తాజాగా ప్రకటించిన 23 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల జాబితాలో 12 స్థానాలను బీసీలకు కేటాయించడం చారిత్రాత్మకమని వారు కొనియాడారు.గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు బొంగోని శంకర్ గౌడ్,ఉస్తేం శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉద్యమకారుడు,బీసీ బిడ్డ సలేంద్ర కొమరయ్యను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.2001 నుండి తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన కొమరయ్యకు సరైన గుర్తింపు దక్కడం బీసీ సమాజమంతా గర్వించదగిన విషయమని,పార్టీ అధినేత్రి కవిత తీసుకున్న ఈ నిర్ణయం అణగారిన వర్గాలకు గొప్ప రాజకీయ భరోసానిచ్చిందని పేర్కొన్నారు.పార్టీ ఆవిర్భావం నుండి కవిత అనుసరిస్తున్న పాంచజన్యం ఎజెండాలో భాగంగా, కులమతాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని వారు వివరించారు.ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు సంబంధించిన కీలక అంశాన్ని నాయకులు ప్రస్తావించారు.సింగరేణి ఏరియాలో గత మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 20న నిరాహార దీక్ష చేస్తానని కవిత ప్రకటించగానే,ప్రభుత్వం దిగివచ్చి జులై 17,18న మెడికల్ బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పార్టీ సాధించిన తొలి విజయమని వారు అభివర్ణించారు.రాబోయే రోజుల్లో పార్టీ అధినేత్రి కవిత మార్గదర్శకత్వంలో బీసీలందరినీ ఏకం చేసి,పెద్దపల్లి గడ్డపై తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేస్తామని వారు స్పష్టం చేశారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామని,బీసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు.ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు కవితకు బీసీ బిడ్డలందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు కల్వల తిరుపతి,చిలుక ఆనంద్,మల్యాల కరుణాకర్,గుర్రం శ్రీనివాస్,ఓదెల మండల నాయకులు నల్లగొండ స్వామి గౌడ్,సుల్తానాబాద్ నాయకులు,పలువురు పార్టీ కార్యకర్తలు మరియు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమం పై అవగాహన సదస్సు

(వరంగల్/ పర్వతగిరి) జులై 16, ప్రజాకలం ప్రతినిధి.

గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కృపారాణి, బేటి బచావో బేటి పడావో పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి




మాట్లాడుతూ, బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 ఫోక్సో యాక్ట్ 2012, మహిళలు, విద్యార్థినిల హక్కులు, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013, సైబర్ క్రైమ్ 1930, నేరాల నివారణ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు లింగ వివక్షతను రూపుమాపి బాలికలకు విద్య, సమాన అవకాశాలు కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, ఉపాధ్యాయినులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## అధికారుల చొరవతో బాల్య వివాహం నిలిపివేత



నిర్మల్ జూలై 16(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భైంసా మండలంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల బాలికకు బాల్య వివాహం జరగనున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాలపై జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గురువారం గ్రామానికి చేరుకుని బాలిక కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్ నిర్వహించి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక, మానసిక, విద్యా, ఆరోగ్యపరమైన అభివృద్ధిపై కలిగే ప్రతికూల ప్రభావాలు, అలాగే బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం తీసుకునే చట్టపరమైన చర్యలపై కుటుంబ సభ్యులకు అధికారులు సమగ్రంగా అవగాహన కల్పించారు.

అధికారుల సూచనలు, కౌన్సెలింగ్‌తో తమ తప్పును గ్రహించిన బాలిక తల్లిదండ్రులు, తమ కుమార్తెకు 18 సంవత్సరాలు పూర్తైన తర్వాత మాత్రమే వివాహం జరిపిస్తామని హామీ ఇస్తూ లిఖితపూర్వక స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్) అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, చట్టం ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తికాకముందు వివాహం జరపడం నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలను నిర్వహించినా, ప్రోత్సహించినా లేదా సహకరించినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్-1098కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతతోనే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మురళి, సూపర్వైజర్ శ్రీజని, కౌన్సెలర్లు శైలజ, కరుణశ్రీ, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, సోషల్ వర్కర్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విజ్ఞాన భారతి విద్యార్థుల ఎంపిక



(వరంగల్/ పర్వతగిరి) జులై 16, ప్రజాకలం ప్రతినిధి. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామంలోని విజ్ఞాన భారతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు సిరబోయిన రామ్ చరణ్, దొణికెన వర్షిత్ లు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రామ్ చరణ్ అండర్ 18 విభాగంలో 800 మీ. పరుగు పందెంలో, వర్షిత్ అండర్ 16 విభాగంలో 2000 మీ. పరుగు పందెంలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ అక్కినపెల్లి సతీష్ కుమార్ తెలిపారు. వీరు ఈ నెల 18న మెదక్ జిల్లా ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు రామ్ చరణ్, వర్షిత్ లతో పాటు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ భూక్యా సురేష్ ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్జద్ పాషా, సరిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

### - రోడ్డు పనులను అడ్డగిస్తే ఊరుకోబోము - కాసుల కోసం కక్కుర్తి పనులా...?

### - గౌరిదేవిపేట మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు , గ్రామస్తుల హెచ్చరిక



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక , జులై 16:

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకుంటే ఎంతటి వారైనా సహించేది లేదని , తాము చూస్తూ ఊరుకోబోమని గౌరిదేవిపేట మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు , గ్రామస్తులు గురువారం నాడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎటపాక మండల పరిధిలోని గౌరిదేవిపేట , నల్లకుంట , విస్సాపురం , లక్ష్మీపురం పంచాయతీలను కలుపుతూ 10 కిలోమీటర్ల మేర ఉన్న ఆర్.అండ్.బి రహదారి దశాబ్దాలుగా పాడై రోడ్డు నిర్మాణం , కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో గిరిజన , గిరిజనేతరులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ క్రమంలో ఇటీవల స్థానిక నాయకులు , వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు సూచన మేరకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి భాస్కర్ చొరవతో రూ.6.17 కోట్ల ప్రభుత్వ నిధులతో నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. శంకుస్థాపన జరిగిన మూడవ రోజు నుండి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా కొందరు స్థానిక నాయకులు కాసులకు కక్కుర్తి పడి సదరు కాంట్రాక్టర్ ను , ప్రభుత్వ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తూ వేధిస్తున్నారని దుయ్యబట్టారు. దాంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇన్ని సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యను గుర్తించని నాయకులు నేడు మాత్రం అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటే కాంట్రాక్టర్ ను ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటు అన్నారు.

కాబట్టి ఎంతటి వారైనా ప్రభుత్వ అభివృద్ధి (రోడ్డు) పనులను అడ్డగిస్తే సహించబోమని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ , ఐటీడీఏ పీవోకు సైతం ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలవల శివకనకరాజు , ముక్కెర భద్రరావు , వార్డు మెంబర్ ఉలవల రమణ , చంటి , బొమ్మగాని చుక్కమ్మ , కాటిబోయిన సుజాత , కాసర్ల మల్లేశ్వరరావు , గవ్వల రామారావు , బోళ్ల వెంకన్న , కాటిబోయిన వాసు , కాటిబోయిన హైమావతి , తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్రి (కె)లో సర్వేను పర్యవేక్షించిన డిప్యూటీ కలెక్టర్

తానూర్, జులై 16(ప్రజా కలం): మండలంలోని ఉమ్రి (కె),ఉమ్రీ -కె



గ్రామాలలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే (ఎస్ ఐ ఆర్ సర్వే) ప్రక్రియను గురువారం డిప్యూటీ కలెక్టర్ ఎలందుల రాకేష్ స్వయంగా పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన సర్వే జరుగుతున్న తీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు, సర్వేకు సంబంధించిన వివరాలను బిఎల్ఓ లతో అడిగి తెలుసుకున్నారు,ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ సాయికిరణ్, గ్రామ సర్పంచ్ పి. మరోతి పాటిల్ పాల్గొన్నారు.

## దశదిన కార్యక్రమానికి హాజరైన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

( వరంగల్/ పర్వతగిరి)జులై 16, ప్రజాకలం ప్రతినిధి. పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన విశ్వజెనిత్ కరస్పెండెంట్ కి.శే. ఎర్రబెల్లి హరికుమార్ దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి పూలమాలతో సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మెన్ యం. మనోజ్ గౌడ్, ఫ్యాక్స్ వైస్ ఛైర్మెన్ సందెల నవీన్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రంగు కుమార్, మాజీ సర్పంచ్ బండి సంతోష్, ఎల్లగౌడ్, కార్యకర్తలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

## పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి - రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



నిర్మల్ జూలై 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద జాబ్‌కార్డుదారులకు కల్పిస్తున్న ఉపాధి వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తగిన పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా జగన్నాథ రథయాత్ర

## ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జూలై 16:

మహబూబ్ నగర్ నగరంలో జగన్నాథ రథయాత్ర కనుల పండుగగా వైభవంగా జరిగింది. ఇట్టి రథోత్సవానికి గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి గౌరవ మహబూబ్ నగర్ ఎంపి శ్రీమతి లిడికె అరుణ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథాన్ని లాగారు. అనంతరం ఆయన మాట్లాడు తూ శ్రీ జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రమ్మలతో కూడిన రథయాత్ర ప్రతి సంవత్సరం ఎంతో భక్తి శ్రద్ధలతో, పూరిలో నగరంలో జరుగుతుంది. అదే జగన్నాథ రథయాత్రలో , ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకుంటారని, అదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అనేక పట్టణాలలో కూడా రథయాత్రలు నిర్వహించడం ఆనందదాయకమని ఆయన అన్నారు. మన పట్టణంలో కూడా గత కొన్ని సంవత్సరాలుగా రథయాత్రను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం



నిర్వహించిన రథయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని ఆయన అభినందించారు. జగన్నాథుని ఆశీస్సులు అందరికీ కలగాలని, మంచి వర్షాలు కురిసి రాష్ట్రంలోని రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మద్ది యాదిరెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాముల పాత్ర ఎంతో కీలకం

## - ఉప అటవీ క్షేత్ర అధికారి మహమ్మద్ నజీర్ ఖాన్

నిర్మల్ జూలై 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం "ప్రపంచ పాముల దినోత్సవం" , వాటిని రక్షించడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సారంగాపూర్ ఉప అటవీ క్షేత్ర అధికారి (డిప్యూటీ రేంజ్ ఆఫీసర్) మహమ్మద్ నజీర్ ఖాన్, మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పాముల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. పాములు ఎలుకలు వంటి పంటలకు హాని చేసే జీవులను నియంత్రించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేస్తాయని, అందువల్ల వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

అంతేకాకుండా, అన్ని పాములు విషసర్పాలు కావని, కొద్ది జాతులు మాత్రమే విషపూరితమైనవని, మిగిలినవి విషరహిత పాములేనని వివరించారు. పాములపై ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలు, సందేహాలను నివృత్తి చేస్తూ వాటిని చంపకుండా అటవీశాఖ లేదా శిక్షణ పొందిన స్నేక్ క్యాచర్లకు సమాచారం అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్ సామాజిక సేవకుడు షేర్ యాసిన్ పాల్గొని పాముల సంరక్షణలో తాను అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే వివిధ రకాల పాములు, వాటి గుర్తింపు, పాములు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేక్ క్యాచర్ షేర్ యాసిన్ ని వారి సేవలను గుర్తిస్తూ అటవీ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, అటవీశాఖ బీట్ అధికారులు, వెన్నెల సుజాత తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను అమలు చేయాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి



మహబూబ్ నగర్ ప్రజా కులం ప్రతినిధి జులై 16:

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ వానాకాలానికి సంబంధించి అత్యవసర ప్రత్యామ్నాయ పంటల (కంటింజెన్సీ క్రాప్ ప్లాన్) కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో ఎల్ నినో ప్రభావంవల్ల జిల్లాలో ఆశించినంత వర్షాలు లేనందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని తెలిపారు. వర్షాలు ఆలస్యమవుతున్న పరిస్థితుల్లో వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి ద్వారా రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు భూసార పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని అన్నారు. కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను సమీక్షించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న సాగునీటిని దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా తగ్గితే వాటిపై ఆధారపడిన బోర్‌వెల్లు కూడా ప్రభావితమవుతాయని, విచక్షణారహితంగా బోర్‌వెల్లు తవ్వడం శాశ్వత పరిష్కారం కాదని పేర్కొన్నారు. నీటి వినియోగంలో స్థిరమైన, బాధ్యతాయుతమైన విధానాలు పాటించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు ప్రతి మండలంలో గ్రామసభలు నిర్వహించి రైతులతో నేరుగా చర్చించాలని, ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి విజయవంతమైన రైతులను గుర్తించి వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తోటి రైతుల అనుభవాలను ఎక్కువగా విశ్వసిస్తారని, అందువల్ల విజయవంతమైన రైతులను ఆదర్శంగా నిలపాలని సూచించారు. రాబోయే రోజుల్లో తాను కూడా ఎంపిక చేసిన మండలాలను సందర్శించి రైతులతో సమావేశమవుతానని తెలిపారు. అంతకుముందు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్కు వివరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఋతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను మూడు దశల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, చెరువులు, కాలువల ద్వారా సాగునీటి అందుబాటును నిరంతరం సమీక్షిస్తూ రైతులకు అనువైన పంటలపై మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే, తక్కువ నీటితో సాగు చేయగల కరువును తట్టుకునే పంటలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జొన్న, సజ్జ, రాగి, ఆముదం, కంది మొక్కజొన్న నల్ల మినుములు, నువ్వులు, ఉలవలు, అలసంద వంటి పంటలతో పాటు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే కూరగాయల సాగుపై కూడా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సమావేశంలో సాగునీటి, ఉద్యానవన, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు తమ శాఖల పరిస్థితులను కలెక్టర్ కు వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన రైతు సూచనల కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలోజిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్లలులేని సేవకు అరుదైన పురస్కారం

## పులిపాటికి "ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు"

## స్వయంగా బహుకరించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

## కరోనా కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి చేసిన సేవకు ప్రతిఫలం



ఖమ్మం జులై 16( ప్రజా కలం న్యూస్)

ఎల్లలు లేని సేవకు అరుదైన పురస్కారం లభించింది. స్వార్థమెరుగని నిజాయితీకి మరో బహుమానం దక్కింది. తన, మన బేధం లేకుండా ఆపద సమయంలో అందరినీ అక్కున చేర్చుకునే నిస్వార్థమూర్తి డాక్టర్ పులిపాటి ప్రసాద్ కు "ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు" లభించింది. ఈ పురస్కారాన్ని 16వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో (ఉండవల్లి) ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పులిపాటికి స్వయంగా బహుకరించడం విశేషం. కరోనా కష్ట కాలంలో విష పరిస్థితులను సైతం అధిగమించి మానవాళికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం దక్కింది. సాటి మనిషిని సమీపించలేని దుస్థితిలోనూ పులిపాటి బడుగు, బలహీన వర్గాలతో పాటు వివిధ సేవా రంగాల ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించారు. లక్షల ఖర్చును వెచ్చించి ఉదారత చాటారు. అలాగే వైద్య రంగంలోని మెడికల్, పారా మెడికల్ విధ్యనభ్యసించిన సుమారు మూడు వేల మంది విద్యార్థులను వారియర్స్ గా తయారు చేసి కరోనా పాజిటివ్ బాధితులకు ప్రత్యక్ష సేవలు అందించడంలో డాక్టర్ పులిపాటి చొరవ చూపారు. ఆ కష్ట సమయంలో ఎంతో సాహసంతో, నిస్వార్థ చింతనతో డాక్టర్ పులిపాటి ప్రసాద్ అందించిన సేవలకు తాజాగా శిల్ప కళా ఆర్ట్స్ ఇంటర్నేషనల్ అకాడమీ వారు "ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్" అవార్డును ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ పురస్కారానికి ఎంపికైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తొమ్మిది మంది ప్రముఖుల్లో డాక్టర్ పులిపాటి ఒకరు కావడం విశేషం,

బాబుతో దశాబ్దాల సాన్నిహిత్యం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ఖమ్మంలోని పులిపాటి విద్యా సంస్థల అధినేత డాక్టర్ పులిపాటి ప్రసాద్ కు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. విద్యార్థి దశలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావుతో అనుబంధం ఏర్పడింది. గండిపేటలో కార్యాలయ కార్యదర్శిగా ఎన్టీఆర్ తో దగ్గరి సాన్నిహిత్యాన్ని పొందగలిగారు. అనంతరం తన పదహారవ ఏట తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పని చేస్తూ చంద్రబాబు తలలో నాలుకలా మెలిగారు. అలాంటి చంద్రబాబు చేతుల మీదుగా పులిపాటి ఈ ప్రత్యేక అవార్డును అందుకోవడం విశేషం. విద్యా సంస్థల అధినేతగా, రాజకీయ నేతగా మరింత ఎత్తుకు ఎదగాలని ఈ సందర్భంగా పులిపాటిని సీఎం చంద్రబాబు నాయుడు ఆశీర్వదించడం శుభ పరిణామం. అలాగే దేశ రాజకీయాల్లో కీలక నేత, లెజెండరీ లీడర్, డైనమిక్ ఫిగర్ చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా "ఎక్సలెన్స్ ఇన్ సోషల్ సర్వీస్ అవార్డు"ను అందుకోవడం తన పూర్వ జన్మ సుకృతమని పులిపాటి వ్యాఖ్యానించారు. సేవా నిరతికి పురస్కారాలెన్నో.

సేవే శ్వాసగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పులిపాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ న్యూస్ ఛానల్ "జీ తెలుగు" అచీవర్స్ అవార్డును బహుకరించింది. హైద్రాబాద్ లోని జలవిహార్ కన్వెన్షన్ హాల్ లో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పులిపాటికి ''జీ తెలుగు అచీవర్స్ అవార్డు''ను బహుకరించారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికించిన సమయంలో డాక్టర్ పులిపాటి ప్రసాద్ తెగువ చూపి ప్రజలకు ఆపన్న హస్తం అందించారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో పాటు వందలాది మంది నిరుపేద ప్రజానీకానికి 10 లక్షలను వెచ్చించి నిత్యావసర వస్తువులు, మందులను పంపిణీ చేశారు. అలాగే తమ నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల్లో చదువుతున్న 72 మంది నిరుపేద పిల్లలకు వారి ఆర్థిక స్థితిని బట్టి 13 లక్షల మేర ఫీజులను తగ్గించడం, మినహాయించడం ద్వారా తల్లిదండ్రుల మన్ననలు పొందారు. రాజకీయ అరంగేట్రం చేసిన తొలినాళ్లలో తెలుగుదేశం పార్టీలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తున్న పులిపాటికి కాంగ్రెస్ సర్కారు పదవి కట్టబెట్టడం సాధారణ విషయమేమీ కాదు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో రాష్ట్ర ప్రజల విజ్ఞప్తుల మేరకు మద్యపాన నిషేధాన్ని అమలులోకి తేవాల్సి వచ్చింది. ఇలాంటి గురుతర బాధ్యతను మోసేందుకు వావిలాల గోపాలకృష్ణయ్యను రాష్ట్ర మద్యపాన నిషేధ కమిటీకి చైర్మన్ గా సర్కారు నియమించింది. శ్రీరామమూర్తిని రాష్ట్ర కన్వీనర్ గా ఎంపిక చేయగా ఖమ్మం జిల్లాలో ఈ గురుతర బాధ్యతను మోసే అవకాశం నాడు తెలుగుదేశం పార్టీలో కీలక నేతగా ఉన్న పులిపాటి ప్రసాద్ కు దక్కింది. మద్యపాన నిషేధ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరించగా పులిపాటి కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టడం నాటి రాజకీయాల్లో సంచలనంగా మారింది. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో వినియోగదారుల భద్రతా మండలి రాష్ట్ర డైరెక్టర్గా పని చేసి అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఘనత పులిపాటికి దక్కింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఎన్టీఆర్ ఈ భద్రతా మండలికి చైర్మన్ గా వ్యవహరించగా నూనూగు మీసాల ప్రాయంలో పులిపాటి డైరెక్టర్ గా వ్యవహరించారు. శాసనసభ స్పీకర్ గా పని చేస్తున్న శ్రీపాదరావు, యనమల రామకృష్ణుడుని జిల్లాకు రప్పించి వారి ద్వారా వినియోగదారుల సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించి ప్రతిపక్షాలను సైతం ముక్కున వేలేసునేలా చేసిన ఘనత పులిపాటి సొంతం. అప్పటి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా జడ్జిలను ఈ మహోన్నత కార్యంలో భాగస్వాములను చేసి ప్రజల్లో వస్తు కొనుగోళ్లు, వినియోగం పట్ల అవగాహన కార్యక్రమాలను ఉవ్వెత్తున నిర్వహించారు. జన జాగృతి పేరిట ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం పులిపాటి చేసిన కృషికి అద్భుతమైన, అపారమైన గుర్తింపు లభించింది. పులిపాటి ప్రసాద్ చైర్మన్ గా, వనజీవి రామయ్య కన్వీనర్ గా జన జాగృతి పరిరక్షణ కమిటీని నియమించగా నాడు జిల్లాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ వనజీవి రామయ్యతో మూడు దశాబ్దాల కిందటే కలిసి పని చేయడం ఆయన మరిచిపోలేని ఘట్టం. నాడు వనజీవితో కలిసి జిల్లా నలు మూలల్లో ఐదు లక్షల మొక్కలు నాటిన ఘనతకు గుర్తింపుగా "పర్యావరణ పరిరక్షణ విశిష్ట సేవా అవార్డు"ని నాటి ప్రభుత్వం పులిపాటికి బహుకరించింది. రాష్ట్ర గవర్నర్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అఫీషియల్ అవార్డును అందుకోవడం చరిత్రాత్మకం.

# స్కూల్ కు వచ్చేసరికి అలసిపోతున్నాం... ఉచిత సైకిళ్ళు ఇచ్చి ఆదుకోండి

## - మేకల సొంపల్లి విద్యార్థుల ఆవేదన

ప్రజా కలం జూలై 16 (గద్వాల ప్రతినిధి)

రోజు కిలోమీటర్ల కొద్ది నడిచి వెళ్లలేక నరకయాతన అనుభవిస్తున్నాం... చదువుకోవాలనే ఆశ ఉన్నా, ఈ ప్రయాణ కష్టాలు మమ్మల్ని కుంగదీస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా త్వరగా స్పందించి మాకు సైకిల్ పంపిణీ చేయాలి అంటూ జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మేకల సొంపల్లి, దాసరిపల్లి, ఉలిగేపల్లి గ్రామ విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆయా గ్రామాల విద్యార్థులు ప్రతిరోజు కాలినడకతో బిజ్వారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తున్న విద్యార్థులు ప్రతిరోజు నడవడం వల్ల కాళ్ల నొప్పులు పడుతున్నాయని, బడికి వచ్చేసరికి తీవ్రంగా అలసిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సందర్భంగా మాకు రవాణా కష్టాలు తీరాలంటే ప్రభుత్వం స్పందించి మాకు ఉచితంగా సైకిలను పంపిణీ చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. సైకిల్ ఉంటే సమయానికి బడికి చేరుకుంటామని, చదువుపై మరింత శ్రద్ధ పెట్టగలమని విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు కనీస బస్సు సౌకర్యం లేదు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబాల పిల్లలు కాలినడకనే నమ్ముకున్నారు. ప్రతిరోజు ఉదయాన్నే ఎండనక, వాననక కిలోమీటర్ల దూరం నడవడం వల్ల పాఠశాలలకు చేరేసరికే విద్యార్థులు తీవ్రంగా అలసిపోతున్నారు. దీనివల్ల ఉదయం మొదటి పిరియడ్ క్లాసులకు సకాలంలో హాజరు కాలేకపోతున్నామని, చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన:

నిర్మానుష్యమైన, అయ గ్రామాల రహదారుల గుండా కాలినడకన ఒంటరిగా వచ్చే విద్యార్థినులు, మహిళల రక్షణ పై తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దారి పొడవునా మద్యం, ఇతర మైకాల్లో తిరిగే అకతాయిల వల్ల విద్యార్థినులకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరగకముందే జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాలని కోరారు. సైకిళ్ళు ఉంటే విద్యార్థులంతా గుంపులుగా, వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రవాణా ఇబ్బందులు, భద్రతా భయాల వల్లే చాలామంది బాలికలు చదువు మధ్యలోనే ఆపేసే (డ్రాపౌట్) ప్రమాదం ఉందనే ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని బిజ్వారం గ్రామ విద్యార్థులకు ఉచిత సైకిళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తాడిచర్ల బ్లాక్ 1 డేంజర్ జోన్ ఇండ్ల సర్వే షురూ



మల్హర్, జూలై 16 ప్రజాకలం ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మల్హర్రావు మండలం తాడిచర్ల గ్రామ పరిధిలోని ఓసిపి బ్లాక్ 01 కు 500 మీటర్ల డేంజర్ జోన్‌లో ఉన్న ఇండ్ల సమగ్ర సర్వే నేటి నుండి శుక్రవారం జూలై 17 నుండి ప్రారంభం కానుందని మల్హర్ తహసీల్దార్ కె రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. డేంజర్ జోన్ ప్రజలు ఇంటి పన్ను రశీదు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డు, కరెంట్ మీటర్ రశీదు, భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్ బుక్ లేదా రిజిస్టర్డ్ డాక్యుమెంట్ సంబంధించిన ధృవ పత్రాలు ఉంచుకోవాలని తెలిపారు.

## జానపద కళారూపాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన

– నాగర్‌కర్నూల్ జిల్లాకు నలుగురు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బదిలీ

– జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 16:మహబూబ్‌నగర్ జిల్లాలో గత ఐదేళ్లుగా సేవలందిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నలుగురు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారథి రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి.బదిలీపై వెళ్తున్న ఎం. జయప్రకాష్, బైండ్ల లక్ష్మణ్, కె. విజయకాంత్, కె. ఉదయ్‌కుమార్‌లు కలెక్టరేట్‌లోని పౌర సంబంధాల శాఖ (డీపీఆర్‌వో) కార్యాలయంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. శ్రీనివాస్‌నుమర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం డీపీఆర్‌వో పి. శ్రీనివాస్ వారిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డి . పి.ఆర్.ఓ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ఐదేళ్లుగా ఈ నలుగురు కళాకారులు ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాల ప్రచారంతో పాటు పరిసరాల పరిశుభ్రత, రోడ్డు భద్రత, ఓటరు అవగాహన, బాలకార్మికుల నిర్మూలన, మూఢనమ్మకాల నిర్మూలన తదితర సామాజిక అంశాలపై కూడా వారి ఆటపాటల తో, జానపద కళారూపాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించారని కొనియాడారు. ఇదే సేవా స్ఫూర్తితో నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై సమర్థవంతంగా అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా తోటి సాంస్కృతిక సారథి కళాకారులు సంతోష్, పద్మ, అశోక్ చారి, ఇతర సిబ్బంది బదిలీపై వెళ్తున్న కళాకారులను పూలదండలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించి వీడ్కోలు పలికారు.

## తాడిచర్ల బీసీ కాలనీలో మంచి నీటి బోరుబావి ప్రారంభం

**మంత్రి శ్రీధర్ బాబుకు తాడిచర్ల పాలకవర్గం, ప్రజల ప్రత్యేక కృతజ్ఞతలు**



తాడిచర్ల, జూలై 16 ప్రజాకలం ప్రతినిధి... గ్రామంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు డీఎంఎఫ్‌టీ నిధుల నుండి నాలుగు బోరుబావులను మంజూరు చేశారని తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి తెలిపారు. గురువారం బీసీ కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 3 లక్షల 42 వేల వ్యయంతో మంజూరైన నూతన బోరుబావి నిర్మాణ పనులను సర్పంచ్ బండి స్వామి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో రూ. 13 లక్షల 70 వేల నిధులను మంజూరు చేయించారని వివరించారు. గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నీటి అవసరాల కోసం సకాలంలో నిధులు కేటాయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు సర్పంచ్ బండి స్వామి, పాలకవర్గం మరియు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తిర్రి అశోక్ గౌడ్, ఇందారపు సారయ్య, ఇందారపు చంద్రయ్య, కామ బాపు, పమ్మిడి నిరంజన్ రావు, మేనం సంగీత రాకేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కేసారపు చంద్రయ్య, మాజీ వార్డు సభ్యులు ఆకుల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూముల రిసర్వే పై అవగాహన సదస్సు

**తహసిల్దార్ ఝాన్సీ రాణి**

ప్రజా కలం జులై 16 (గద్వాల ప్రతినిధి) మల్దకల్ మండల పరిధిలోని నేతివాని పల్లె గ్రామంలో గురువారం భూముల రి సర్వే పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తహసిల్దార్ ఝాన్సీ రాణి హాజరై సర్వే గురించి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న భూముల రి సర్వే లో భాగంగా మల్దకల్ మండలంలో రి సర్వే నిర్వహిస్తున్నట్లు అందులో మల్దకల్ మండలంలోని ఏడు గ్రామాలను ఎంపిక చేసి ముందస్తుగా ఆయా గ్రామాలలో రిసర్వే నిర్వహిస్తున్నట్లు ఆమే తెలిపారు. ఇందులో నేతువాని పల్లె గ్రామంలో రి సర్వే చేస్తామని అన్నారు. దీని ముఖ్య ఉద్దేశం గ్రామ కంఠం గ్రామ శివారు గ్రామంలోని రోడ్లు పట్టా భూములు ప్రభుత్వ భూములు తదితర వాటిని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ బీచుపల్లి సీనియర్ అసిస్టెంట్ కరీం,జిపిఓ, సర్పంచ్ పద్మా వెంకటేష్ నాయక్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



### మంత్రులు పర్యటన హడావిడి మాత్రమే కానీ...

# అభివృద్ధికి మాత్రం నిధులు శూన్యం

**బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్**



ప్రజా కలం జూలై 16 (గద్వాల ప్రతినిధి)

గద్వాల నియోజకవర్గానికి మంత్రులు వచ్చిపోతున్నారే తప్పా అభివృద్ధికి మాత్రం నిధులు విడుదల చేయడం లేదని గద్వాల బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రుల పర్యటనపై పార్టీ నాయకులతో కలిసి,బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి మంత్రులు వచ్చినప్పుడు కాంగ్రెసులో వర్గాల హడావుడి,ఆధిపత్యల పోరు తప్పా గద్వాలకు ఒరిగిందేమీ లేదని బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు.ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కనీసం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వకుండా మంత్రులు నియోజకవర్గంలో పర్యటించడం సిగ్గుచేటు అని అన్నారు.గద్వాల నియోజకవర్గ ప్రజలను రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.ట్రాన్స్ఫర్ల ఓపెనింగ్ కి వచ్చిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కనీసం మా నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడలేదని అని ప్రశ్నించారు.ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్ ఓపెనింగ్ వచ్చిన ఉపముఖ్యమంత్రి గాలి మోటర్లు లో పోవడానికి టైం అయితుందని,చెప్పి,కనీసం నియోజకవర్గ అభివృద్ధి నిధులపై, ప్రజల సమస్యల గురించి మాట్లాడకుండా వెళ్లిపోవడం పై ఈ ప్రాంత ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పనులే కానీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కనీసం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకుండా, కాలయాపన చేస్తున్నారని అన్నారు.

ప్రస్తుతం మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క ట్రాన్స్ఫార్మర్ మంజూరు కావడానికి నెలలు పడుతున్నాయని రైతులు పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని విమర్శించారు.ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు ఒక్క కిలోమీటర్ దూరంలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్ లో 4 టీఎంసీల సామర్థ్య ఉన్న ప్రాజెక్ట్ లీకేజీ ప్రాబ్లం ఉన్నది అని 2 టీఎంసీల కు కుదించిన విషయం తెలిసికూడా సందర్శించకపోవడం పై మండిపడ్డారు.

మొన్న ధరూర్ మండల కేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభలో మీ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పై సభకు వచ్చిన మహిళలు తిరుగుబాటే మీ ప్రభుత్వ పాలన యొక్క నిదర్శనం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, చంటన్న,గువ్వల గోపాల్,మోహన్ యాదవ్,చిత్తరి కిరణ్,కమ్మరి రాము,చక్రీధర్ రెడ్డి,బీచుపల్లి,వెంకటేష్ యాదవ్,తిమ్మప్ప గౌడ్,శ్రీరాములు, పూడూరు రఘు నాయుడు,గంజిపేట అరవింద్,మాలిక్,రాము,లోకేష్,భాస్కర్,జగదీష్,నరసింహులు, గోవిందు, వీరేష్, రాజు, మహేష్, కృష్ణ, మహేందర్, నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి

**మాలలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిద్దాం: దామల సత్యం**



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జూలై 16:

భద్రాచలం పట్టణంలో ఇటీవల మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన మాలల బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర గనులు కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాల సమాజానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ హైదరాబాద్‌లో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించడం స్వాగతించదగ్గ పరిణామమని మాల మహానాడు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి దామల సత్యం పేర్కొన్నారు. భద్రాచలం సభలో మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, “మాల జాతి కోసం ఎంత దూరమైనా వస్తాను. అవసరమైతే మంత్రి పదవిని సైతం వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు పదవులు కాదు, మాల జాతి ముఖ్యం” అని ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి జరిగిన నష్టాలను సరిదిద్దేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, మాలలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తానని భద్రాచలం సభలో ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించడం హర్షణీయమన్నారు.

హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు డాక్టర్ వివేక్ వెంకటస్వామి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనరసింహ, మాల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొని మాల సామాజిక వర్గ సమస్యలపై సమగ్రంగా చర్చించడం శుభపరిణామమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు పెద్దఎత్తున ఉద్యమంలో పాల్గొనాలని మన జాతి ముద్దు బిడ్డ వివేక్ వెంకటస్వామి వెంట మనం భాగస్వాములు కావాలని దామల సత్యం పిలుపునిచ్చారు. భద్రాచలం సభ ద్వారా జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మాల సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపిన మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పావులాజ్, జిల్లా నాయకులు ఏవీ రావు,జిల్లా కార్యదర్శి ఏ. వీరబాబు, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగా విద్యార్థులకు ఉపకారణాల పంపిణీ

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, జులై 16:

భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం విద్యాశాఖ–సమగ్ర శిక్ష తెలంగాణ మరియు ఆలింకో వారి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, భద్రాచలం ఆవరణలో ఉన్న భవిత కేంద్రములో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమము నిర్వహించటం జరిగింది. భద్రాచలం మండలం విద్యాధికారి తోటమల్ల రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల నుండి మొత్తము 49 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. విద్యార్థులకు ట్రై సైకిల్లు ,శ్రవణ పరికరాలు వినికిడి పరికరాలు, నడిచే పరికరాలు తదితర అవసరమైన ఉపకరణాలను అందజేశారు .ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో ఆరోగ్యము మరియు విద్యకి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నానని తెలియజేశారు . దివ్యాంగులైన విద్యార్థులకు సేవ చేయడము భగవంతుడికి సేవ చేయడం లాంటిదని దివ్యాంగ విద్యార్థులందరూ ఈ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని



భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని తెలియజేశారు. కుటుంబ సభ్యులందరూ వీరికి పూర్తి సహకారాన్ని అందించాలని అన్నారు. ఈ పరికరాల అందిస్తున్నఆలింకో సంస్థకి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఐఇఆర్పిలు ఎంతో ఓపికతో ఈ పరికరాలను ఎలా ఉపయోగించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మండలం సర్పంచ్ పునేం కృష్ణ, దుమ్ముగూడెం మండల విద్యాధికారి సున్నం సమ్మయ్య, చర్ల మండల విద్యాధికారి రమణ, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుజి.జాన్సన్, ఎంపీయుపిఎస్ ప్రధానోపాధ్యాయులు రాజ శ్రీనివాస్, వార్డ్ మెంబర్స్ మూడు మండలాల ఐఆర్పిలు, సీఆర్పిలు మరియు వార్డ్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

## ఖమ్మంలో మేరా యువ భారత్ లో యువ వాలంటీర్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం, జూలై 16 ( ప్రజా కలం న్యూస్) భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో (మై భారత్), మేరా యువ భారత్ ఖమ్మం ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రభుత్వ కార్యక్ర మాల అమలు కోసం గ్రామీణ ప్రాంతాల్లో యువజన సంఘాల నిర్మాణం కోసం యువ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తు ఆహ్వానించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల మేరా యువ భారత్ అధికారి మద్దుల వెంకట్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం, నైపుణ్యాలను మెరుగు పరచడం ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకువెళ్లడం ప్రతి గ్రామంలో యువజన సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం, యువతకు సామాజిక సేవ వైపు తీసుకు వెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. వయసు 18 నుంచి 29 సంవత్సరాల మధ్య ఉండాలి. విద్య అర్హత కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఖమ్మం ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండాలని, సామాజిక సేవ పట్ల ఆసక్తి ఉండాలి. దరఖాస్తు విధానం, అభ్యర్థులు మై భారత్ అధికారిక పోర్టల్ హెచ్ టిటిటిపి// మై భారత్. జి వోవి. ఇన్ కు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకొని ఆన్లైన్ దరఖాస్తును సమర్పించాలని ఇందులో ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. చివరి తేదీ 20 జూలై 2026 ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం 5000రూపాయలు, కాలవ్యవధి రెండు సంవత్సరాలు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుంది. వివరాలకు మేరా యువ భారత్ ఖమ్మం కార్యాలయం ఫోన్ నెంబర్ 91773 29258 సంప్రదించలన్నారు.

### ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో

## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ పుల్లయ్య.**



పాలేరు జులై 16( ప్రజా కలం న్యూస్ ) కూసుమంచి మండలం పరిధిలోనే గురువారం నర్సింహులగూడెం గ్రామంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు మరియు వర్షాల ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా, తక్కువ కాలవ్యవధిలో పండే మరియు తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ సూచించిన పెసర, కంది , జొన్న, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా, వ్యవసాయ భూముల్లో ఫార్మ్ పాండ్లు (వ్యవసాయ నీటి కుంటలు) నిర్మించుకోవడం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని వివరించారు. భూగర్భ జలాల పెరుగుదలకు, నీటి సంరక్షణకు, పంటల స్థిర దిగుబడులకు ఫార్మ్ పాండ్లు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాణి, వ్యవసాయ విస్తరణ అధికారి జానీ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్నాథుని కృపతో ప్రజలం సుభిక్షంగా ఉండాలి

**– మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్**



( నందిగామ జులై 16 ప్రజా కలం ప్రతినిధి ) జగన్నాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా,శాంతి, ఆనందాలతో నిండాలని మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్ ఆకాంక్షించారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్టీసీ కాలనీలోని శ్రీ జగన్నాథ స్వామి వారిని మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ రథయాత్ర ద్వారా ప్రతి ఒక్కరికీ శాంతి, మానసిక బలం, మరియు కొత్త ఆశలు అందించాలనే ఉద్దేశ్యంతో సాగుతుందని వారు పేర్కొన్నారు. జగన్నాథ స్వామి దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో షాద్నగర్ కౌన్సిలర్స్ శివ, గోపాల్,సుధీర్,మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాన్,వెంకట్రామిరెడ్డి,మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్,నాయకులు బిక్షపతి,ఒడిస్సా శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మానవపాడులో విషాదం.. వాటర్ హీటర్ షాక్ తో వివాహిత మృతి



ప్రజా కలం జులై 16 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం మానవపాడు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. వాటర్ హీటర్ కు కరెంట్ షాక్ తగిలి 26 ఏళ్ల వివాహిత మంజుల భాయి మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి 7 గంటల సమయంలో జరిగిందని గ్రామస్తులు తెలిపారు. మంజుల భాయి స్నానం చేయడానికి బాత్రూం కి వెళ్లారు. ఆ సమయంలో వాటర్ హీటర్ లో ప్రమాదవశాత్తు కరెంట్ లీక్ అయింది.

దీంతో ఆమెకు తీవ్రమైన కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు



# రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి

## - పూరి జగన్నాథ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్, జులై 16,(ప్రజా కలం)

రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగ్ సర్కిల్ పరిధిలోని మై హోమ్ అవతార్ గేటెడ్ కమ్యూనిటీ హాల్‌లో నేడు ఘనంగా నిర్వహించిన శ్రీ పూరి జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాశ్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథ స్వామివారి రథయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ భక్తిశ్రద్ధలతో స్వామివారికి నమస్కరించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, జగన్నాథ స్వామివారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయం, పాడి పరిశ్రమతో పాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. అదేవిధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలందరూ ఆనందంగా, సుభిక్షంగా జీవించాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు జగన్నాథ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి: వైద్య ఆరోగ్య మంత్రికి వినతి

హైదరాబాద్:16 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వినతిపత్రం ద్వారా వివరించారు. ఈ



సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ,గత 18 సంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఇప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నామని తెలిపారు. తమను కాంట్రాక్ట్ విధానంలో నియమించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఐ ఎఫ్ ఎం ఎస్,ద్వారా వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ,వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని మంత్రిని కోరారు.అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు గత 10--12 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేసి, ఇకపై ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆరోగ్యశ్రీ ప్రభుత్వ ఆసుపత్రుల డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్ భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ శ్రీహరి, ట్రెజరర్ పయ్యావుల సంతోష్,గంగాల సురేందర్ (గజ్వేల్),దయాకర్, శ్రీనివాస్ తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళిత బంధు పథకాన్ని వెంటనే అమలు చేయాలి: మాజీ జెడ్పీటీసీ డా. పంగ మల్లేశం

గజ్వేల్:16 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన దళిత బంధు పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని గజ్వేల్ మాజీ జెడ్పీటీసీ డా. పంగ మల్లేశం కోరారు.గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి దళిత బంధు అమలు చేయడం ద్వారా దళిత కుటుంబాలను ఆర్థిక, సామాజికంగా బలోపేతం చేశారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు.దళితులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు మంజూరు చేసిన రూ.170 కోట్ల అభివృద్ధి నిధులను తిరిగి విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చుట్టూ నిర్మిస్తున్న 24 కిలోమీటర్ల రింగ్‌రోడ్డులో సుమారు 600 మీటర్ల మేర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని,ఆ పనులను పూర్తి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు.రైతు రామచంద్రంతో చర్చించి అవసరమైన నిధులు కేటాయించి రింగ్‌రోడ్డును పూర్తి చేస్తే గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై అధికార పార్టీ, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డా. పంగ మల్లేశం కోరారు.



# సంగారెడ్డి లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన జగ్గారెడ్డి

## - సంగారెడ్డి పట్టణం లో ఇస్కాన్ ఆధ్వర్యం లో వైభవంగా జగన్నాథ రథయాత్ర
## -సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి పిఎస్సార్ గార్డెన్ వరకు సాగిన యాత్ర
## - భజనలు, కోలాటాలతో భక్తిపారవశ్యంలో మునిగిన సంగారెడ్డి పురవీధులు



సంగారెడ్డి ప్రతినిధి
జులై 16( ప్రజా కలం):

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

ఈ ఆధ్యాత్మిక వేడుకకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ఘనంగా ప్రారంభించారు.ఈ రథయాత్ర సంగారెడ్డి కొత్త బస్టాండ్ నుండి ప్రారంభమై, పట్టణ పురవీధుల గుండా పిఎస్సార్ గార్డెన్ వరకు సాగింది. రథం కదిలిన వెంబడి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులలో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సంగారెడ్డి పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిరంతరాయంగా నిర్వహిస్తూ, ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ ప్రతినిధులను జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన స్వయంగా భక్తి పాటలు పాడుతూ భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, ప్రముఖ నాయకులు కూన సంతోష్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మున్సురాబాద్‌లో జరిగిన అవమానకర చర్యపై నేతల తీవ్ర ఆగ్రహం

## యాదాద్రి దేవస్థాన పాలకమండలి సభ్యురాలు ఈశ్వరమ్మ ఘన స్వాగతం పలికిన
## - టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ, రిటైర్డ్ ప్రొఫెసర్ తలారి.ప్రేమ్ కుమార్
## - డాక్టర్ తడక యాదగిరి అనువదించిన భారత రాజ్యాంగ ప్రతిని ఈశ్వరమ్మకు బహుకరణ



హైదరాబాద్,ఎల్బీనగర్,
జులై 16,(ప్రజా కలం)

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా నూతనంగా నియమితులైన పోచబోయిన. ఈశ్వరమ్మ యాదవ్‌కి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ టీపీసీసీ .ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ, రిటైర్డ్ ప్రొఫెసర్ తలారి.ప్రేమ్ కుమార్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉమా మహేష్ కుమార్ గౌడ్ ఘనస్వాగతం పలికారు. ఆమెను ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి, దైవాశీస్సులు అందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తలారి ప్రేమ్ కుమార్ మరియు డాక్టర్ తడక యాదగిరి అనువదించిన భారత రాజ్యాంగ ప్రతిని ఈశ్వరమ్మ కి బహుకరించారు. ప్రతి ఇంటింటా రాజ్యాంగం ఉండాలని, బడుగు, బలహీన వర్గాల ఎదుగుదలకు, సామాజిక సమతుల్యతకు భారత రాజ్యాంగమే దిక్సూచి అని వారు ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

అవమానకర చర్యపై నిరసన

ఒకవైపు అభినందనల వేళ, మరోవైపు మున్సురాబాద్ ప్రాంతానికి చెందిన ఒక అగ్రవర్ణ నాయకుడు ఈశ్వరమ్మ పట్ల ప్రదర్శించిన అహంకారపూరిత వైఖరిని, అవమానకరమైన తీరును ప్రేమ్ కుమార్ ఉమా మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధిగా, అదీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళగా అత్యున్నత పదవిలో ఉన్న ఆమెను అవమానించడం సామాజిక స్పృహ లేని చర్య అని, ఇది ప్రజాస్వామ్యానికి అవమానకరమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పలు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలు, యువజన ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని కులం పేరుతోనో, వర్గం పేరుతోనో కించపరచడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. అగ్రవర్ణ దురహంకారంతో వ్యవహరించే వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పాలని, శ్రీమతి ఈశ్వరమ్మ గారి ఆత్మగౌరవాన్ని కాపాడటంలో తామంతా అండగా ఉంటామని స్పష్టం చేశారు.అణగారిన వర్గాల ప్రతినిధుల ఎదుగుదలను ఓర్వలేక జరుగుతున్న ఇటువంటి వివక్షా పూరిత ఘటనలను సమాజం ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

# వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ కే.హైమావతి




సిద్దిపేట జిల్లా ప్రతినిధి:16 జూలై ( ప్రజా కలం ప్రతినిధి )

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.త్రాగునీటి సరఫరా,సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్య, వాతావరణ పరిస్థితులు,ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అంశాలపై సమీక్ష నిర్వహిస్తూ ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని,త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.అనంతరం ఐడీఓసీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించి,వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే మెట్టపంటలు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలలు,గురుకులాలు, కేజీబీవీల పరిసరాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టి దోమల వ్యాప్తిని అరికట్టాలని గ్రామపంచాయతీలకు సూచించారు.జిల్లాలో త్రాగునీటి కొరత రాకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో స్వీకరించిన దరఖాస్తులను గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖలకు సూచించారు.ఈ సమావేశంలో డీఆర్ఓ నాగరాజమ్మతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా.... ఇక్రిశాట్ కార్మికులకు

# రూ. 26000/- వేతనాలు పెంచాలి

## - కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి
## - కార్మికులకు అన్యాయం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
## -సంగారెడ్డి జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్

సంగారెడ్డి ప్రతినిధి జులై 16 (ప్రజా కలం):

ఇక్రిశాట్ లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు కనుగుణంగా రూ. 26000/-పెంచాలని చట్టబద్ధమైన సౌకర్యాలు కార్మికుల కల్పించాలని కార్మికుల అన్యాయం చేస్తున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు అతిమేల మానిక్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా అతివేల మానిక్ మాట్లాడుతూ రామచంద్రపురం మండలం ఇక్రిసశాట్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గత వారం రోజులుగా వేతనాలు పెంచాలని



ఆందోళన చేస్తున్నారని అన్నారు.. అంతర్జాతీయ స్థాయి కలిగిన ఇక్రిశాట్ లో కార్మికులకు అన్యాయం జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు. నెలకు రూ.15000/- జీవితాలు చెల్లిస్తున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలతో ఇంటి కిరాయిలు పిల్లల చదువులు వైద్యం ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయని అన్నారు. కనీస వేతనాలు చట్టం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ డాక్టర్ అక్రాయిడ్ ఫార్ములా సుప్రీంకోర్టు తీర్పు పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని కనీసం రూ.32000/- ఉండాలి అని అన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పెంచడం లేదు. సిఐటియు మరియు కార్మిక సంఘాలు రూ. .26000/- కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయని అన్నారు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక్రిశాట్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంగారెడ్డి జిల్లా కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు..

# అంగన్వాడీ చిన్నారులకు సకల వసతులు కల్పిస్తాం- సర్పంచ్ రాజాగారి రేణుక.

సిద్ధిపేట ప్రజాకలం జూలై 16.

రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాల్లో గురువారం చిన్నారులకు నూతన దుస్తులను గ్రామ సర్పంచ్ రాజాగారి రేణుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి వారి ఆరోగ్యం,



విద్యపై ఆరా తీశారు. సర్పంచ్ రాజాగారి రేణుక మాట్లాడుతూ, ప్రభుత్వం అంగన్వాడి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగి నాణ్యమైన ప్రాథమిక విద్యను అభ్యసించేలా పోషకాహారం, విద్యా సామగ్రి, దుస్తులు తదితర సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామంలోని ప్రతి అంగన్వాడి కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడి కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న సేవలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యపై కుటుంబ సభ్యులు, అంగన్వాడి సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఉపసర్పంచ్ స్వామి, గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# హాజరు పెంచేందుకు విద్యార్థులను కారులో తీసుకు వెళుతున్న ఎంఈఓ విటల్.

ప్రజా కలం ప్రతినిధి జూలై 16 మెదక్ జిల్లా చిలపు చెడు మండల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతం నమోదు ఎన్రోల్మెంట్ రోజువారి హాజరు పెంచేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని మండల విద్యాధికారి చెప్పారు.ప్రతి ఉపాధ్యాయుడు తమ పాఠశాలల పరిధిలో ప్రతి ఇంటికి సందర్శించి బడికి రాని పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఇప్పటికే నమోదైన విద్యార్థుల ప్రతిరోజు హాజరు అయ్యేవిధంగా తల్లిదండ్రులు నిరంతరం సంప్రదించాలని ఉపాధ్యాయులతో చెప్పారు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులో ఉన్నాయ ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులను తన కారులో పాఠశాలకు తీసుకువెళ్లిన మండల విద్యాధికారి విట్టల్ విద్యార్థులను కారులో తీసుకువెళ్లిన విద్యాధికారిని చూసి పలువురు అభినందనలు తెలిపారు



## కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి చొరవతోనే మహేశ్వరం మండలాల్లోని తండాలు అభివృద్ధి

### కొత్త తండా కాలనీ లో 10 లక్షల రూపాయల తో సిసి రోడ్డును ప్రారంభించిన మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు ఉప్పుగడ్డ నేనావత్ రాజు నాయక్

మహేశ్వరం, జులై 16, (ప్రజా కలం)

కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి చొరవతోనే మహేశ్వరం మండలాల్లోని తండాలు అభివృద్ధి జరుగుతుందని మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు ఉప్పుగడ్డ నేనావత్ రాజు నాయక్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఉప్పుగడ్డ గ్రామపంచాయతీ లోని కొత్త తండా కాలనీ లో 10 లక్షల రూపాయల



బడ్జెట్ తో సిసి రోడ్డును మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుగడ్డ నేనావత్ రాజు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు కిచేనా గారి లక్ష్మారెడ్డి గారి ప్రత్యేక దృష్టితోనే తాండాలను మౌలిక సదుపాయాలు కల్పించడంలో తన వంతు కృషి చేస్తున్నారు అని ఆయన కృషి వల్లే మహేశ్వరం మండలంలోని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయాని అన్నారు. ఉప్పుగడ్డ గ్రామపంచాయతీలో కొత్తతండా కాలనీ లో 10 లక్షలరుపాయల వ్యయంతో సీసీ రోడ్డు వేయడం జరుగుతుంది అని ఆయన చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు మాజీ సర్పంచ్ కేతావత్ రాజు నాయక్, ఉపసర్పంచ్ మోహన్ నాయక్, కార్యదర్శి శ్రీనివాస్, వార్డ్ నెంబర్లు కేతావత్ శివ నాయక్, సరిత శ్రీనివాస్ నాయక్, బాదావత్ పరమేష్ నాయక్ , నినావత్ రవీందర్ నాయక్ కాంట్రాక్టర్ రామకోటి గ్రామ యువకులు రాజు కళ్యాణ్ సురేష్ రాజు నాయక్ గ్రామ సిబ్బంది రజనీకాంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ బీజేపీ నాయకులు యువతరానికి హస్తంలో అవకాశాలు

### పేదల సంక్షేమానికే సీఎం రేవంత్ పెద్దపీట

### మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జులై 16, (ప్రజా కలం)

పేద, మధ్య తరగతికి కూడు, గూడు, సంక్షేమం అందించేది ఒక్క ఇందిరమ్మ రాజ్యం అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సెక్రటరీ ఏల్మేటి అమరేందర్ రెడ్డి, ఎస్సీ డిపార్ట్మెంట్ ఛైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో కెఎల్ఆర్ సమక్షంలో హస్తం పార్టీలో 150 మంది విపక్షాల నాయకులు చేరారు. ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లాడుతూ ప్రజాపాలనలో సీఎం



రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలు సహా రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమానికి ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరేందుకు యువతరం ముందుకొస్తుందని అన్నారు. పాత, కొత్త తేడా లేకుండా పార్టీ బలోపేతం దిశగా నాయకులు అడుగులు వేస్తే తప్పకుండా అవకాశాలు కల్పిస్తామని లక్ష్మారెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని మోసం చేసిన విషయాన్ని కెఎల్ఆర్ గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్శిటీని ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసినట్లు కిచ్చెన్నగారు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని... సోషల్ మీడియాను సాధనంగా వాడుకోవాలని కె ఎల్ ఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి,సహా కొత్తగా పార్టీలో బీజేపీ నుంచి రాఘవేందర్, బీఆర్ఎస్ నుంచి దొడ్డి శ్రీకాంత్ సహా వందలాది మంది విపక్షాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ లీడర్లు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట నిర్వహించిన కొలనుగూడ గ్రామ మహిళలు

కందుకూరు, జులై 16,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రం కొలను గూడ గ్రామ సర్పంచ్ గోరికల బీరప్ప ఆధ్వర్యంలో గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని కోరుతూ



కందుకూరు మండలం కొలనుగూడ గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా కప్పతల్లి ఆట నిర్వహించారు. గ్రామమంతా తిరుగుతూ భక్తిశ్రద్ధలతో ఈ ఆచారాన్ని నిర్వహించి, గ్రామానికి మంచి వర్షాలు కురవాలని ప్రార్థించారు. ప్రస్తుతం విత్తనాలు వేసే సమయం దాటిపోతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంచి వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల కష్టాలు తొలగి వ్యవసాయం సాఫీగా సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని గ్రామ సంప్రదాయాలను కొనసాగిస్తూ వర్షదేవుని ప్రార్థించారు.

# నేరాల నియంత్రణలో పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి.

### - వార్షిక తనిఖీలలో భాగంగా జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ .

### - సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించిన.

### - జిన్నారం పోలీసు అధికారుల, సిబ్బంది పనితీరు ప్రశంసనీయం : ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.



సంగారెడ్డి ప్రతినిధి జులై 16 ( ప్రజా కలం): వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లను సందర్శించారు. ఈ సందర్భంగా జిన్నారం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పటాన్‌చెరువు డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి అందజేసిన కిట్ ఆర్టికల్స్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనపరచుకున్న, కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకొని, క్రైమ్ సంబంధించిన వాహనాలను సకాలంలో కోర్టులో డిపాజిట్ చేయాలని, అన్‌క్లెయిమ్డ్ వాహనాలను బహిరంగ వేలం ద్వారా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు.

అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేసి, ప్రతి రికార్డును అప్డేట్ గా ఉంచాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం కలిగి శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, పగలు, రాత్రి బీట్‌లలో వారిని తరచూ తనిఖీ చేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికులు (మైగ్రెంట్ లేబర్) ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి, బ్లాక్ స్పాట్లుగా అభివృద్ధి చేసి, పగలు-రాత్రి బీట్ విధుల్లో నిఘా మరింత పెంచాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తూ, గ్రేవ్ కేసులలో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, ఎలాంటి రికార్డులు పెండింగ్‌లో లేకుండా చూసి, అవసరమైన సూచనలు ఎస్‌హెచ్‌ఓలకు అందించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, యువ కానిస్టేబుళ్లు అన్ని రకాల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని, భవిష్యత్తులో స్టేషన్ రైటర్లుగా ఎదగాలని సూచించారు. తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్-1 నుండి పార్ట్-5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్-2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సూచించారు. జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, విధుల నిర్వహణలో మరింత కష్టపడి పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంట పటాన్‌చెరువు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సీఐ పి. రమణారెడ్డి, ఎస్‌హెచ్‌ఓ హనుమంతు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు

### - అక్రమ నిర్మాణాలు జిహెచ్ఎంసి అధికారులకు కనిపించడం లేదా

### - ప్రభుత్వానికి గండి కొడుతున్న అధికారుల మౌనం

### - సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి

శంషాబాద్, జులై 16,(ప్రజా కలం)

శంషాబాద్ పట్టణ శివారులోని సాయి బాలాజీ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు అపార్ట్మెంట్ కట్టి ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్న బిల్డర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులను సిపిఐ మండల కార్యదర్శి నర్రాగిరి డిమాండ్ చేశారు.

శంషాబాద్ పట్టణం నడిబొడ్డున శివారులలో ఇంతటి దుర్మార్గమైన వ్యాపారం జరుగుతుంటే జిహెచ్ఎంసి అధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నర్రాగిరి అధికారులకు తెలిపారు. అక్రమ నిర్మాణాలు శంషాబాద్లో జోరుగా జరుగుతున్న జిహెచ్ఎంసి అధికారులకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిసిన జిహెచ్ఎంసి అధికారులు టిపిఓ మౌనం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## కాటేదాన్ టాటా నగర్ లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

### - ప్రత్యేక పూజలు నిర్వహించిన కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్

రాజేంద్రనగర్, జులై 16,(ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి కాటేదాన్ డివిజన్ టాటా నగర్ లో శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న 'శ్రీ జగన్నాథ రథయాత్ర' సందర్భంగా ముఖ్య అతిథిగా కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదములు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర సందర్భంగా భక్తుల కోలాహలం, హరేకృష్ణ నామస్మరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో, భక్తుల కీర్తనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సంకీర్తనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని అన్నారు. స్వామివారికి మహా హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కాటేదాన్ డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షులు ఉప్పల్ శీను కిలారి వెంకటరమణ భీమ రాయుడు నరేష్ వీరస్వామి మోహన్ రిషి గణేష్ సుధామా బాపి బాబు నీళ్ల సిద్ధూ రామ్ పింటూ దిలీప్ పిశీటు పెద్ద ఎత్తున ఒరిస్సా కు చెందిన జగన్నాథ స్వామి పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ యువజన సంగ్రామ సభ

### - నిరుద్యోగ హామీల కోసం బీఆర్ఎస్ తొలి సమరం

### - పార్టీలకు అతీతంగా సరూర్ నగర్ కు తరలిరావలని పిలుపు

### - హామీల ప్రకటించిన ప్రాతం నుంచే నిలదీత

### - నిరుద్యోగులను కాంగ్రెస్ నిలువునా ముంచిందని ఆరోపణలు



హైదరాబాద్, జూలై 16 (ప్రజా కలం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో తెలంగాణ యువతను, విద్యార్థులను నిలువునా ముంచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సరూర్ నగర్ వేదికగా ప్రియాంక గాంధీని తెచ్చి, ఏటా రెండు లక్షల ఉద్యోగాలంటూ కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసమని ధ్వజమెత్తారు. నిరుద్యోగులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి గ్యారంటీల పేరుతో మోసం చేయడం తప్పా, అమలు చేసిన పాపన పోలేదన్నారు. ఇప్పటివరకు ఎన్ని వేల ఉద్యోగాలు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి,మంత్రులకే క్లారిటీ లేదని ఎద్దేవా చేశారు. ప్రశ్నించిన నిరుద్యోగుల పై లాఠీ ఛార్జ్ చేయడం, పోలీస్ స్టేషన్ కు తరలించడం, కేసులు పెట్టడమే తప్పా వారి డిమాండ్ లను పరిష్కారం చేసింది లేదన్నారు.

కాళేశ్వరం సీఎం రేవంత్ రెడ్డికి ఉరితాడు.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు శ్రీరామరక్షగా ఉంటే, కాంగ్రెస్ మాత్రం దానిపై విషం చిమ్ముతోందని, అదే కాళేశ్వరం ఇప్పుడు రేవంత్ రెడ్డి మెడకు ఉరితాడుగా మారిందని స్పష్టం చ్ఛశారు. బీఆర్ఎస్ హయాంలో 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 10 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎండగట్టేందుకు, నిరుద్యోగుల్లో ధైర్యం నింపేందుకు ఈ నెల 18న సరూర్ నగర్‌లో భారీ ఎత్తున యువ సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సభకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తూ ఆటంకాలు సృష్టిస్తోందని, అవసరమైతే కోర్టుకు వెళ్లైనా పర్మిషన్ తెచ్చుకుంటామన్నారు. యువత, విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ బలం చూపించాలని పిలుపునిచ్చారు.

**దొంగ హామీలు..కాలమే సమాధాం చెప్పుతుంది- ఎర్రోళ్ల శ్రీనివాస్**

కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నవన్నీ దొంగ హామీలని, యువతను, నిరుద్యోగులను నట్టేట ముంచిన ఈ ప్రభుత్వానికి కాలమే సరైన సమాధానం చెబుతుందని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఈ నెల 18న సరూర్ నగర్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యువ సంగ్రామ సభ పోస్టర్‌ను హాప్సిగూడలో నిరుద్యోగ జేఏసీ నాయకులు, వివిధ యూనివర్సిటీల విద్యార్థి నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, సరూర్ నగర్ వేదికగా గతంలో కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసమని విమర్శించారు. 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 పథకాల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ జీవితాలు బాగుపడతాయని ఆశించిన యువతకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 30 నెలల్లో ఎన్ని వేల ఉద్యోగాలు ఇచ్చారో ఈ ప్రభుత్వానికే కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేశారని, కనీసం వారి సమస్యలు వినడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా లేదని మండిపడ్డారు. తెలంగాణలో హక్కుల కోసం పోరాడుతున్న నిరుద్యోగుల పై లాఠీ దెబ్బలు రుచి చూపించడం దుర్మార్గమన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచాలన్నా, కూల్చాలన్నా యువతే కీలకమని, ఈ ప్రజా వ్యతిరేక పాలనపై తిరుగుబాటుకు సరూర్ నగర్ సభే తొలిమెట్టు కాబోతుందని ఆయన స్పష్టం చేశారు.

నిరుద్యోగుల్లో ధైర్యాన్నినింపేలా..

బీఆర్ఎస్ యువజన నేత సాయి యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జూన్ 2 నాటికి జాబ్ క్యాలెండర్, 2 లక్షల ఉద్యోగాలంటూ నమ్మించి నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మానసిక ఆందోళనకు గురిచేసిందన్నారు. బాధల్లో ఉన్న నిరుద్యోగుల్లో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత మనందరి పై ఉందన్నారు. ఈ నెల 18న సరూర్ నగర్ వేదికగా జరగబోయే సమరశంఖానికి వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నేత మంతెన అమ్రీష్,మన్నె క్రిశాంక్ , డాక్టర్ కె. వాసుదేవ రెడ్డి, కె. కిషోర్ గౌడ్, దూసరి శ్రీనివాస్ గౌడ్, నిరుద్యోగ జేఏసీ నాయకులు, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి పై దాడి

**ప్రభుత్వ ఉద్యోగిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండించిన ట్రేసా జిల్లా శాఖ.**

**నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి.**



సంగారెడ్డి, ప్రతినిధి జూలై 16:( ప్రజా కలం):

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ , సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 15 తేదిన హత్నూర మండలంలోని గుండ్లమాచినూర్--పాల్పనూర్ క్లస్టర్‌కు చెందిన జీపీఓ తంబరబోయిన సత్యనారాయణ , తహసీల్దార్ ఆదేశాల మేరకు ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మగూడ గ్రామంలో బీఎల్ సూపర్వైజర్‌గా, ఆర్.ఐ. మరియు బీఎల్ఓ సంతోషి తో కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించేందుకు ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న సమయంలో ముక్కగళ్ల సత్యనారాయణ తండ్రి నరసింహ అనే వ్యక్తి దాడికి పాల్పడిన ఘటనను సంఘం తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై ఇటువంటి దాడులు వారి భద్రతకు భంగం కలిగించడమే కాకుండా, ప్రజా పరిపాలన సజావుగా సాగడంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని సంఘం పేర్కొంది. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణించి నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరింది. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సంఘం తెలిపింది. అలాగే ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తగిన భద్రత కల్పించి, వారు నిర్భయంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు గంగాధర్ రావు.కార్యదర్శి కిరణ్ కుమార్, టిజిపిఓ యూనియన్ కార్యదర్శి. మహమ్మద్ ఫారిద్ టిజిపిఓ యూనియన్ అధ్యక్షులు అంజన్ కుమార్, శ్రీనివాస్. మధు. రాజు.తదితరులు పాల్గొన్నారు.

# ఎంబీటీ నేత అంజద్ ఉల్లా ఖాన్‌పై మీర్‌పేట్ పోసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ క్లస్టర్--1 అధ్యక్షుడు బిక్షపతి చారి క్లస్టర్--2 అధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్

మహేశ్వరం, జులై 16,(ప్రజా కలం)

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్‌తో పాటు భారతీయ జనతా పార్టీపై సోషల్ మీడియా వేదికగా అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన ఎంబీటీ నాయకుడు అంజద్ ఉల్లా ఖాన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదిభట్ల ఏసిపి ప్రదీప్ కుమార్ రెడ్డి మీర్పేట్ సిఐ శోభన్ కు బీజేపీ క్లస్టర్--1 అధ్యక్షుడు బిక్షపతి చారి, క్లస్టర్--2 అధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. బిజెపి క్లస్టర్1 అధ్యక్షుడు బిక్షపతి చారి మాట్లాడుతూ సామాజిక శాంతి, సామరస్యాన్ని దెబ్బతీసేలా వ్యక్తులు, రాజకీయ పార్టీలపై సోషల్ మీడియాలో అసభ్యకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని బిజెపి నాయకుల సహనాన్ని పరీక్షించవద్దని ఎం బి టి నాయకుడు అంజదుల్లా ఖాన్ ను హెచ్చరించారు.బిజెపి క్లస్టర్ 2 అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పాత బస్తీలో ఉంటూ మహేశ్వరశీ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు పై సోషల్ మీడియా పరంగా అనుచిత వాక్యాలు చేయడం సమంజసం కాదని మా మహేశ్వర నియోజకవర్గంలో రోగియాలు పాకిస్తాన్ ముస్లింలు అరాచకాలు సృష్టిస్తే వాటిని అడ్డుకోవడానికి బిజెపి పార్టీ కంకణం కట్టుకొని పనిచేస్తుంటే సంబంధంలేని నియోజకవర్గం బిజెపి నాయకులు పై చేసిన సంబంధిత పోస్టులపై సమగ్ర విచారణ నిర్వహించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం అంజద్ ఉల్లా ఖాన్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వారు కోరారు. సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ ద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇంద్రావత్ రవి నాయక్. సిద్ధల శ్రీనివాస్ మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి మాజీ అధ్యక్షులు పెండాల నరసింహ. జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడూరు సోమేశ్వర్ ముత్తంగి కరుణానిధి. జిల్లా కార్యదర్శులు నీల రవి నాయక్ విజయలక్ష్మి ముదిరాజ్. మాజీ మద్ది రాజశేఖర్ రెడ్డి ప్రజా ప్రతినిధులు కీసర హరినాథ్ రెడ్డి ఏ భీమ్రాజ్ గౌరీ శంకర్ రవీందర్ రెడ్డి గాజుల మధు లతాశ్రీ మల్లేశం కాశీరామ్ యాదవ్ జగన్ ముదిరాజ్ విక్కీ సాగర్ కృష్ణ మల్లారెడ్డి ఉదయ్ బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# పంట పొలాల్లో కేబుల్ దొంగల హల్చల్

**కన్నీరుమున్నీరవుతున్నరైతన్నలు**

**- బెజ్జోరా - ముచ్కూర్ మధ్య వరుస దొంగతనాలు**

**- వర్షాలు లేక ఒకపక్క.. మోటర్లు నడవక మరోపక్క పంటలు తీవ్ర నష్టం**

**- రక్షణ కల్పించాలని భీంగల్ పోలీసులకు రైతుల వేడుకోలు**



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండల పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. బెజ్జోరా మరియు ముచ్కూర్ గ్రామాల మధ్య ఉన్న పంట పొలాల్లో దుండగులు వరుసగా మోటర్ల కలెక్షన్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో నిరంతరాయంగా కేబుల్ దొంగతనాలు జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో, భూగర్భ జలాలపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో దుండగులు మోటర్ కేబుళ్లను దొంగిలించడంతో బావుల నుంచి నీరు పారించే అవకాశం లేకుండా పోయింది. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పంటలు నీరందక ఎండిపోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. రూ. వేలల్లో నష్టం..ఒక్కో మోటర్ వైర్ దొంగతనం వల్ల రైతులకు వేల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ఒకసారి వైర్ పోతే మళ్లీ కొనుగోలు చేయడం చిన్న, సన్నకారు రైతులకు భారంగా మారింది. "ఒకపక్క ప్రకృతి కరుణించడం లేదు, మరోపక్క దొంగల భయంతో రాత్రుళ్లు నిద్ర కరువైంది. మా పంట పొలాల కాడ ఉన్న మోటర్లను, కేబుళ్లను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది" అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై భీంగల్ మండల పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి, రాత్రి వేళల్లో పొలాల వైపు పెట్రోలింగ్ నిర్వహించాలని, దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని బెజ్జోరా, ముచ్కూర్ గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# కుత్బుల్లాపూర్, బహదూర్‌పల్లి డివిజన్‌లలో SIR-2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలను ప్రారంభం



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 286 కుత్బుల్లాపూర్ డివిజన్, 294 బహదూర్‌పల్లి డివిజన్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ పరిధిలో ఏర్పాటు చేసిన SIR-2026 హెల్ప్ డెస్క్ కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటర్లకు SIR-2026 ప్రక్రియపై అవగాహన కల్పించడం, అవసరమైన సమాచారం అందించడం, నమోదు ప్రక్రియలో సహాయ సహకారాలు అందించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... SIR-2026 కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్లకు అవసరమైన సహాయం అందించడంలో హెల్ప్ డెస్క్‌లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ రాహుల్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించాలి

**-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి/ మోత్కూర్, జూలై 16 ప్రజాకలం:ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలతో పాటు రోగులకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం మోత్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి,వైద్య సేవలు, పరిశుభ్రత,రోగులకు అందుతున్న సేవలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముందుగా ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించిగా,వార్డుల్లోని బెడ్‌షీట్లు సరిగ్గా లేకపోవడం గమనించి సంబంధిత సూపర్‌వైజర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేసారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,బెడ్‌షీట్లను ఎప్పటికప్పుడు మార్చి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు."బెడ్‌షీట్లు అపరిశుభ్రంగా ఉంటే రోగులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు ఎలా వస్తారు"అంటూ వైద్యులు,సిబ్బందిని ప్రశ్నించారు.ఆసుపత్రి ప్రాంగణం,వార్డులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆసుపత్రిలో ప్రతి రోజు ఎంతమంది ఓపీ రోగులు వస్తున్నారు,వారికి ఏయే మందులు అందిస్తున్నారు, అవసరమైన రక్త పరీక్షలు, ఇతర నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.రోగుల వివరాలు,చికిత్స,పరీక్షల సమాచారం అంతా ఈ-ఆరోగ్యం (e-Arogya) యాప్‌లో సకాలంలో నమోదు చేస్తున్నారా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి వివరాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ధృవీకరించాలని,ఆదేశించారు.ఈ నెలలో ఎన్ని ప్రసవాలు (EDD\T) ఉన్నాయో,గర్భిణీ స్త్రీలను ఏ విధంగా ట్రాక్ చేస్తున్నారని ఆరా తీశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని ప్రసవాలు జరిగాయి,ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఎన్ని ప్రసవాలు జరిగాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిన గర్భిణీలు,ఏ కారణాలతో వెళ్లారో కూడా ఆరా తీశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు,అత్యవసర వైద్య సేవలు,అవసరమైన మందులు,పరీక్షలు,వైద్య సిబ్బంది తదితర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.గర్భిణీ స్త్రీలు, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు,పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం వైద్య సిబ్బంది బాధ్యత అని అన్నారు.ఆసుపత్రి పరిసరాలలో ఉన్న మంచి నీటి ట్యాంక్ వృధాగా నీరు నిలిచి ఉండటంతో వెంటనే సంబంధిత మున్సిపల్ కమిషనర్ కి ఫోన్ చెసి ట్యాంక్ ని,ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేయించాలని,వాటర్ ట్యాంక్ క్లీన్ చేసి వాడకంలోకి తీసుకవచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు.ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ముంబై కాంక్రోచ్లు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, అవినీతి రహిత పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో కాంక్రోచ్ జనతా పార్టీ మహారాష్ట్ర శాఖ గురువారం ముంబైలోని ఆజాద్ మైదాన్లో ఆందోళన నిర్వహించింది. ప్రధానంగా కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మహారాష్ట్ర విద్యా మంత్రి దాదా భుసే రాజీనామా చేయాలి, వివిధ పోటీ పరీక్షల పేపర్ లీక్‌లు అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరపాలి, దోషులపై కఠిన చర్యలు తీసుకొని జవాబుదారీతనం నిర్ధారించాలి, విద్యార్థులకు అవినీతి రహిత, న్యాయమైన, విశ్వసనీయ విద్యా వ్యవస్థ అందించాలాంటూ కాక్రోచ్లు డిమాండ్ చేశారు. మరోవైపు ఢిల్లీ జంతర్-మంతర్ వద్ద సోనమ్ వాంగ్చుక్ ప్రారంభించిన నిరాహార దీక్షకు 17 రోజులు పూర్తై ఆరోగ్యం క్షీణిస్తున్నందున ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని ముంబై విద్యార్థులు కోరారు. ఈ ధర్నాలో అనేక కాలేజి యూనివర్సిటీల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరైయ్యారు. తోడుగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, సామాజిక సంస్థలు, సామాన్య పౌరులందరూ మద్దతు పలికారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు విరుద్ధంగా ఉపన్యాసాలు, పాటలు, కవితలు, నినాదాలతో మైదానమంతా దద్దరిల్లింది. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం సాగుతుందని విద్యార్తి లోకం హెలెన్ చేసింది.

# ఈ నెల 17, 18. తేదిలలో టైప్ రైటింగ్ పరీక్షలు.

**సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టైప్ రైటింగ్ పరీక్షలు**



సంగారెడ్డి ప్రతినిధి జులై 16(ప్రజా కలం):

సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలో పాలిటెక్నిక్ పరీక్షలు జరగనున్నట్లు టి.టి.ఎస్.సి.ఐ.ఎ. తెలంగాణ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కృష్ణమూర్తి తెలిపారు . ఈ నెల 17, 18 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు రెండు రోజుల పాటు సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇస్మాయిల్ ఖాన్‌పేట్ సమీపంలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. రోజుకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు తమకు కేటాయించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని బి. కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

# అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి..

**- కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న మైక్రో బాక్స్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

**- మైక్రో బాక్స్ కార్మికులకు న్యాయం చేయాలి**

**- సంగారెడ్డి జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్**

సంగారెడ్డి ప్రతినిధి జులై 16( ప్రజా కలం):

మైక్రో బాక్స్ పరిశ్రమల్లో అక్రమంగా తొలగించిన కార్మికులను తిరిగి డ్యూటీలో తీసుకోవాలని, కార్మిక చట్టాలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మైక్రో బాక్స్ కార్మికులకు న్యాయం చేయాలని సంగారెడ్డి జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు.. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల కోసం రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మైక్రో బాక్స్ కార్మికులకు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామ పరిధిలోని మైక్రో బాక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకున్నారని సాకుతో యాజమాన్యం 13 మంది కార్మికులను అక్రమంగా తొలగించిందని అన్నారు. చట్టబద్ధంగా కార్మికులు యూనియన్ పెట్టుకుంటే నేరమా అని ప్రశ్నించారు. యాజమాన్యం వైఖరితో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికులందరికీ విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకొని మైక్రో బాక్స్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోకపోతే భవిష్యత్తులో సమరసిల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.. మైక్రో బాక్స్ కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని అన్నారు. మైక్రో బాక్స్ కార్మికుల రిలే దీక్షలకు సువెన్ ఫార్మ కార్మికులు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు, మైక్రో బాక్స్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి సువెన్ ఫార్మ యూనియన్ ఉపాధ్యక్షులు చంద్రయ్య జాయింట్ సెక్రెటరీ అన్నాజీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు..






# రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలి

## - పలు గ్రామాల్లో అవగాహన కల్పించిన ఏ ఈ ఓ లు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజా కలం : ఎల్ నినో ప్రభావంతో వర్షాలు కురువని నేపథ్యంలో రైతులు వరికి బదులు ప్రత్యమ్నాయ ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరుతూ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని రేపల్లెవాడ, ధావల్ మల్కపల్లి, కొక్కొండ, శివాపూర్ ,లింగారెడ్డి పేట గ్రామాలలో రైతులకు ఆరుతడి పంటల గురించి అవగాహన కల్పించారు. పెసర, మినుము, జొన్నలు, సజ్జలు మొదలైన అరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు దుద్దుల సాయిరాం, పురము దీవెన రవేందర్, నాగరాజు, ఏ ఈ ఓ లు రాజా గౌడ్, ముఖీద్, రవీందర్, రవి ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కోదండరాం చేతుల మీదుగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక 'దశాబ్ది వేడుకల' పోస్టర్ ఆవిష్కరణ

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (TVUV) ఏర్పడి పది సంవత్సరాలు పూర్తి చేసుకుని 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, ఈ ఏడాది ఆగస్టు 6వ తేదీన ఘనంగా 'దశాబ్ది వేడుకలు' నిర్వహించనున్నారు. ఈ వేడుకల పోస్టర్‌ను



తెలంగాణ జన సమితి (TJS) కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధికి విద్యే ప్రధాన కారణమని, ప్రతి విద్యార్థికి సమాన విద్యా అవకాశాలు లభించాలన్నదే తమ వేదిక ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి ఏటా నిర్వహించే విధంగానే, ఈ సంవత్సరం కూడా విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించి వారికి తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో "ఎక్సెన్స్ అవార్డు" అందజేసి ఘనంగా సత్కరించనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు నిజ్జన రమేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామావత్ లాల్ సింగ్, తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, విద్యార్థి వేదిక మాజీ ఐటీ సెల్ కన్వీనర్ జహంగీర్, జిల్లా అధ్యక్షులు రాంపూర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజా కలం : ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో



గురువారం రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక గ్రామ సర్పంచ్ సోని ప్రకాష్ మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరిట నిజం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకుందాం...

# వర్షపు నీటిని ఓడిసి పడదాం...

## - ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజా కలం : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు కూడా ఇంకుడు గుంతలు నిర్మించుకొని వర్షపు నీటిని వృధా పోనీయకుండా కాపాడు కోవాలని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ సూచించారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలోని పలు వార్డులో ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీటిని నిర్మించడం వల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయి అన్నారు. అంతేగాక రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా నివారించడంతో పాటు దోమల బెడద, అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై నిజామాబాద్ సీపీ పి. సాయి చైతన్య క్షేత్రస్థాయి పరిశీలన

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

వచ్చే ఏడాది (2027) నిర్వహించనున్న ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ యాజమాన్యంతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా గురువారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య (ఐపీఎస్) క్షేత్రస్థాయిలో పర్యటించారు. కమిషనరేట్ పరిధిలోని మెండోరా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పోచంపాడు (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు) పరిసరాలను, గోదావరి పుష్కర ఘాట్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.



సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష:ఈ పర్యటనలో భాగంగా సీపీ పుష్కర ఘాట్ల ప్రస్తుత నిర్మాణ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, వాకింగ్ ట్రాక్‌లు, వాహనాల పార్కింగ్ స్థలాలు, అత్యవసర సేవల విభాగాల ఏర్పాటు, హెలిప్యాడ్ కోసం అనువైన స్థలాలను ఆయన స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అధికారులకు సీపీ ఆదేశాలు:పుష్కరాల సమయానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా:ఘాట్ల పరిసరాల్లో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు.నిరంతర నిఘా కోసం తాత్కాలిక పోలీస్ సహాయ కేంద్రాల స్థాపన.ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు నియంత్రణ చర్యలు.అత్యవసర స్పందన బృందాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ.అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం:భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. పుష్కరాలను అత్యంత విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, ఇరిగేషన్ శాఖ డీఈ సురేష్, ఏఈలు సుశాంత్ కుమార్, వంశీ, పంచాయతీరాజ్ శాఖ రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాస్ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కుకునూరు ఉన్నత పాఠశాలకు కుర్చీలు విరాళం

## ఉపాధ్యాయిని సి.హరిత ఉదారత

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

వేల్పూర్ మండలంలోని కుకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ భాషోపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్న సి.హరిత పాఠశాల పట్ల తనకున్న అంకితభావాన్ని చాటుకున్నారు.




పాఠశాలలోని విద్యార్థుల, సిబ్బంది అవసరాలను గుర్తించిన ఆమె.. తన వంతు సామాజిక బాధ్యతగా దాదాపు 6 వేల రూపాయల విలువ గల 10 నూతన కుర్చీలను పాఠశాలకు గురువారం విరాళంగా అందించారు. తన కుమార్తె తన్విక మరియు తన మిత్రురాలి కుమార్తె అద్వికల పేర్ల మీద ఈ కుర్చీలను బహూకరించినట్లు ఉపాధ్యాయిని హరిత తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు. పాఠశాల అవసరాలను గుర్తించి, ఉదారంగా స్పందించిన హరిత గారిని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. విధి నిర్వహణలోనే కాకుండా పాఠశాల ప్రగతికి తోడ్పాటునందించినందుకు గానూ ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హరిచరణ్, ఉపాధ్యాయ బృందం సభ్యులు పతాని గంగాధర్, జి. రవీందర్, చరణ్ దాస్, అశోక్, నాగరాజు మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

## - జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేత

జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు.



కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజా కలం : ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు అత్యవసర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మదన్మోహన్రావు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, గిరిజనులు, గ్రామ పంచాయతీలలో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు వంటి ప్రజలకు అత్యంత అవసరమైన సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామ సర్వేనెంబర్ 268, మాల్ తుమ్మెద గ్రామ సర్వేనెంబర్ 834, 838 భూములకు సంబంధించిన రైతులకు ఇప్పటివరకు పట్టా పాస్ పుస్తకాలు అందలేదని, సదురు రైతులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. అలాగే గండివేట్ తండా, హేమ్లా నాయక్ తండా, వెంకటాపూర్ తండాలలో గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని, సంబంధిత భూములపై సమగ్ర పరిశీలన చేపట్టి అర్హులైన లబ్ధిదారులకు భూములను కేటాయించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో మహిళా అధికారులు, పంచాయతీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతి గ్రామ పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాగిరెడ్డి పేట మండలంలో సమీకృత మండల కార్యాలయ సముదాయం నిర్మాణం కోసం 20 ఎకరాల ప్రభుత్వ భూమి, మినీ స్టేడియం నిర్మాణం కోసం 5 ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. అదే మండలంలోని బొల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రాము తాండ నుండి లింగోజిపల్లి పోచమ్మ ఆలయం వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి పెండింగ్లో ఉన్న అటవీ అనుమతులు త్వరిత గతిన మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ ను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు.

# కరెన్సీపై అంబేడ్కర్ ఫోటో సాధనకు ఆగస్ట్ 7న చలో ఢిల్లీ !



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 16:

కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి (సిఏపిఎస్ఎస్) జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరుశురాం ముంబైలోని చైత్యభూమి సాక్షిగా ఆగస్టు 7న చలో డిల్లీ అంటూ ముంబై ప్రజలకు పిలుపునిచ్చారు. అట్టి అంశంపై గత 16ఏళ్లుగా దేశవ్యాప్తంగా ఉద్యమం సాగుతుందని, ఇప్పటి వరకు 26సార్లు దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నాలు నిర్వహించిన ఘనత ఉందన్నారు. ఈ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అనగా ఆగస్టు 7న మళ్ళీ ధర్నా కార్యక్రమం కాబోతుందని పరశురాం తెల్పారు.

తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చేంత వరకు ఇలాంటి ఆందోళనలు కొనసాగుతాయని అన్నారు. బుధవారం సాయంత్రం ముంబైలోని అంబేద్కర్ నివాసమైన "రాజగృహ", సమాధిఐన "చైత్యభూమి" ని తన టీంతో సందర్శించి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిఏపిఎస్ఎస్ ముంబై శాఖ ప్రముఖులైన సంటి శంకర్ మహరాజ్, ఏనుగంటి నరేంద్ర మహరాజ్, బోడొల రాజేందర్ మహరాజ్, గుమ్మడి బొందన్న మాలజీ, గాయకులు భీంరత్న మాలజీ, మూలనివాసి మాలజీ పాల్గొన్నారు.

# కామారెడ్డి జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 16 ప్రజా కలం : కామారెడ్డి జిల్లాలో పలువురు ఎస్సైలను ఎస్పీ రాజేష్ చంద్ర బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మాచారెడ్డి ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనిల్‌ను భిక్కనూరు స్టేషన్‌కు, భిక్కనూరులో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులును రాజం పేటకు బదిలీ చేశారు. రాజంపేటలో ఉన్న మహేష్?ను జిల్లా కేంద్రంలోని సీసీఎస్?కు కేటాయించారు. ఇక బీబీపేట స్టేషన్ బాధ్యతలు చూస్తున్న విజయ్ ను మాచారెడ్డికి, బాన్సువాడ టౌన్ ఎస్సై నవీన్ చంద్రను బీబీపేటకు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో పలు మండలాల్లో కొత్త ఎస్సైలు బాధ్యతలు చేపట్టనున్నారు. శాంతి భద్రతలను మరింత పటిష్టం చేయాలని ఉద్దేశంతోనే ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమితులైన జగ్గర్ల ఆనంద్ గౌడ్

బొమ్మలరామారం (ప్రజా కలం): జూలై 16

బిజెపి పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన జగ్గర్ల ఆనంద్ గౌడ్ అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం, పక్కిర్ గూడెం గ్రామానికి చెందిన జగ్గర్ల ఆనంద్ గౌడ్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులుగా నియమితులైనారు



ఈ సందర్భంగా జగ్గర్ల ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ అపారమైన నమ్మకంతో తనకు జిల్లా కార్యవర్గ సభ్యునిగా బాధ్యత ను అప్పగించిన జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ కి, సహకరించిన జిల్లా, నియోజవర్గం, మండల బిజెపి కుటుంబ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు, పార్టీ బలోపేతానికి తన వంతు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను జిల్లాలోని ప్రతి గ్రామంలో అమలయ్య విధంగా కృషి చేస్తానని అన్నారు



## కస్టమర్ల మన్ననలు పొందినప్పుడే మంచి వ్యాపారం జరుగుతుంది:కూన

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కస్టమర్ల మన్ననలు పొందినప్పుడే మంచి వ్యాపారం జరుగుతుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. గురువారం షాపూర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలాజీ ట్రేడర్స్ డ్రై ఫ్రూట్స్ అండ్ కిరాణం షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....షాప్ యజమాన్యం మున్నాలాల్ బటియాకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నాయకులు కూన రవీందర్ గౌడ్, కూన రాఘవేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పాలకృష్ణ, ఫూల్ చంద్ బాటి, మున్నాలాల్, సునీల్ బాటి, మాణిక్చంద్ బాటియా, అనిల్ బాటి, అఖిల్ గౌడ్, మక్బుల్ బాయ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతన డీసీసీ ఉపాధ్యక్షులు నియామక పత్రం అందజేత

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ ని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ ఉపాధ్యక్షునిగా నియమించారు. ఈసందర్భంగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హన్మంతన్న శాలువాతో సత్కారించి ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ కి నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తోందన్నారు. ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, సంస్థాగత బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు అభిమానులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- అధికారులకు ఫిర్యాదు చేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు
- స్వచ్ఛంద సంస్థ అధ్యక్షునికి ఫోన్ చేసి కాంట్రాక్టర్ బూతు పురాణం
- కాంట్రాక్టర్ పై కఠిన చర్యలకు తీసుకోవాలని..
- ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఉప్పల్ జూలై 16(ప్రజాకలం న్యూస్)

అభివృద్ధి పనులలో భాగంగా ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్ డివిజన్ లోని ఇందిరానగర్ లో సీసీ రోడ్డు వేసి క్యూరింగ్ చేయకుండా నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అధికారులను కోరారు.సిసి రోడ్డు వేసి క్యూరింగ్ చేయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడంతో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ సంబందిత అధికారులకు పోటోలు పంపించి సమాచారం ఇవ్వడంతో సదరు కాంట్రాక్టర్ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ కు ఫోన్ చేసి ఇష్టానుసారంగా భూతులు తిడుతూ దుర్భాషలాడాడు. ఈ మేరకు స్వచ్ఛత సంస్థ ప్రతినిధులు కాంట్రాక్టర్ పై ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో గురువారం పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాధనంతో రోడ్లు,డ్రైనేజీలు,పలు అభివృద్ధి పనులు చేస్తూ గుత్తేదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సరిగ్గా పనులు చేయకుండా ప్రశ్నించిన వారిని దుర్భాషలాడిన కాంట్రాక్టర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు గోసుల విజయ్ కుమార్, రవీందర్ రావు, సురేష్,రాజు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# షిరిడి సాయిబాబాపై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

-సాయి వ్యతిరేకుల్లారా ఖబర్దార్.. -సాయి వ్యతిరేకులపై పోరాటానికి రమణానంద మహర్షికి మద్దతు

-ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ విద్యార్థులు



యాదాద్రి భువనగిరి జూలై 16 ప్రజాకలం:షిరిడి సాయిబాబా పై దుష్ప్రచారం చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ విద్యార్థులు అన్నారు.ఇటీవల శిరిడి సాయినాధునిపై ఎనిమిది మంది సాయి వ్యతిరేకులు చేసిన విమర్శలను తిప్పి కొట్టడానికి,సిద్ధగురు రమణానంద మహర్షి చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఓయూ కాలేజీ విద్యార్థులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమంది సాయి భక్తులు,సాయి దేవాలయాల నిర్వాహకులు, సాయి వ్యతిరేకులకు బుద్ధి చెప్పలేకపోయారు.కానీ సిద్ధగురు రమణానంద మహర్షి సాయి పక్షాన నిలబడి ధీటుగా “శత ప్రశ్న శరసంధానం”గ్రంథం రాసి వ్యతిరేకుల నోరుమూయించారు.అంతే కాకుండా రమణానంద మహర్షి ఒక్కరే నిలబడి సాయి వ్యతిరేకులతో పోరాటం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అందుకే తమంత సామూహికంగా మహాపీఠానికి వచ్చి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు.రమణనంద మహర్షి మా మద్దతును ఆమోదించాలని, సభాపర్వకంగా కోరుకుంటున్నామన్నారు.ఇది కేవలం స్వచ్ఛందంగా మాత్రమేనని,ఎవరి ప్రలోభాలకు ఒత్తిడిలకు లోని కాకుండా మద్దతు ప్రకటించాలని నిర్ణయించుకున్నామని, తెలిపారు.ఈ కార్యక్రమంలో మామిడాల రవికుమార్, వైస్ ఎంపీపీ ఆవుల మల్లేష్, పాలకొర్ల జానయ్య గౌడ్, తదితర ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

# భీమలింగం బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

-సుమారు 50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శ్రీకారం

-ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



వలిగొండ జులై 16 ప్రజా కలం:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని సంగెం--బోలేపల్లి, చౌటుప్పల్ - భువనగిరి గ్రామాల మధ్య మూసి నదిపై నిర్మించనున్న సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు గురువారం భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు.పనులు ప్రారంభించే ముందు భీమలింగం కట్ట వద్ద శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యేగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న,ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సంగెం,బోలేపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయన్నారు. సుమారు రూ.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి,పరిపాలనా ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారని,రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభమయ్యేలా సహకరించారని అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఈ బ్రిడ్జి ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.భువనగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు.నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈఈ ఆర్‌డబి సరితారాణి, భువనగిరి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు,గ్రామ పెద్దలు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# మోసాల డిక్లరేషన్..

డిక్లరేషన్ లో పేరుతో అన్నిమోసాలే, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్

ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్న కేటీఆర్ - యువజన సభ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో సమీక్ష



హైదరాబాద్, జులై 16, ప్రజాకలం ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం పదవీకాలం పూర్తికాకముందే ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా, డిక్లరేషన్ల పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచి పోతుందని ఆయన మండిపడ్డారు. గురువారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో హైదరాబాద్ చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి వర్గం ఈ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉందన్నారని స్పష్టం చేశారు.

ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయమే జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని దుయ్యబట్టారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయించుకున్న సర్వేల్లోనే ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని, తన పదవీకాలం ముగిసిపోతుందనే అక్కసుతోనే సీఎం అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి, కరువు అంచున కొట్టుమిట్టాడుతుంటే.. సాగునీటి కోసం అడుగుతున్న రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి రక్తం పారిస్తా అని సీఎం మాట్లాడటం అత్యంత దురదృష్టకరమన్నారు. దీంతో రైతులు సైతం మా రక్తాన్ని తీసుకోండి..కానీ మా పొలాలకు నీళ్లివ్వండి అని డిమాండ్ చేసే దుస్థితిని ఈ ప్రభుత్వం తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే సభలు–కేసీఆర్

ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ ఘోరంగా వంచించిందని, ఆ వైఫల్యాలను ఎండగట్టేందుకే బీఆర్ఎస్ వరుస సభలు నిర్వహిస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు.వరంగల్ రైతు సభ విజయ వంతమైన తర్వాత, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతతో భారీ యువ సంగ్రామ సదస్సును తలపెట్టినట్లు ప్రకటించారు. ఈ సభకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, వాటిని సమర్థంగా తిప్పికొట్టేందుకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సరిహద్దు నియోజకవర్గాల నుంచి నిరుద్యోగులు, యువత స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సభ విజయవంతమైతే బీఆర్ఎస్ పార్టీలో కొత్త ఉత్సాహం ఉరకలు వేయనుంది. నిరుద్యోగ సభతో నేతలు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు..



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com